విశాఖపట్నం
శుక్రవారం 24 జులై 2026
For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:181 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## అట్టడుగు నుంచి... అంతరిక్ష ప్రయోగానికి

### లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ 'శక్తి శాట్'కు ఎంపికై చరిత్ర సృష్టించిన బాలిక

### మంత్రి నారా లోకేష్ ప్రశంసలు

(రాజమహేంద్రవరం - జయ జయహే)



పేదరికం ఏమాత్రం ప్రతిభకు అడ్డుకాదని తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని కందుల జెస్సీ నిరూపించింది ప్రపంచంలోనే తొలి ఆల్-గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన మిషన్ శక్తి శాట్' కు ఎంపికై చరిత్ర సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ నుండి ఈ అత్యున్నత అంతర్జాతీయ వేదికకు ఎంపికైన ఏకైక విద్యార్థినిగా జెస్సీ నిలవడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 108 దేశాల నుంచి సుమారు 12,000 మంది బాలికలు ఈ కార్యక్రమం కోసం ..మిగతా 2లో

# స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

### ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ పోటీచేసి గెలవాల్సిందే

### ఆగస్టు 15 నుంచి గ్రామాల్లో పార్టీ సమావేశాలు

### నాలుగు నెలల పాటు కోఆర్డినేటర్స్ గ్రామ, వార్డు పర్యటనలు

### ఈ సమావేశాల్లో పార్టీ కమిటీలకు గుర్తింపు కార్డుల పంపిణీ

### ప్రజాసమస్యలపై గళం

### క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలి

### కోనసీమ జిల్లా నేతలకు వైయస్ జగన్ దిశానిర్దేశం



(తాడేపల్లి - జయజయహే)

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను అత్యంత కీలకమైనవిగా భావించి, పార్టీ శ్రేణులు వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రతి స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బరిలోకి దించి విజయం సాధించేలా ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో వైయస్ జగన్ గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పార్టీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ డిప్యూటీ సీఎం పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి విజయలక్ష్మితో పాటు అమలాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు పాల్గొన్నారు. తొలుత జిల్లా ముఖ్య నాయకులతో సమీక్ష నిర్వహించిన ..మిగతా 2లో



## ఎల్ నినోపై అప్రమత్తంగా ఉండాలి

### తాగు, సాగు నీటికి తీవ్ర కష్టాలు రావొచ్చు

### రైతులకు మంత్రులు అవగాహన కలిగించాలి

### 3,168 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి అధ్యయనం

### ఏడాదికి రూ. 25 వేల నేతన్న భరోసా

### గోదావరి పుష్కరాల పనులకు రూ. 50 కోట్లు

### హంద్రీనీవా, నేరడి బ్యారేజీ పనులకు నిధులు

### కేబినెట్ భేటీలో కీలక నిర్ణయాలు

(అమరావతి - జయజయహే)

అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ భేటీలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ పనుల పురోగతి నుంచి ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనే ప్రణాళికల వరకు పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. చేనేత కార్మికులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు 'నేతన్న భరోసా' కింద ఏడాదికి ..మిగతా 2లో

# కూటమి ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తోంది

### జీవో నెంబర్ 3, వన్ ఆఫ్ 70 యాక్ట్‌లను మాట నిలబెట్టుకోవాలి

### వైఎస్సార్‌సీపీ గిరిజన నేతలు డిమాండ్

(విశాఖపట్నం, జయజయహే)



ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన కూటమి ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో కాలయాపన చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన నేతలు మండిపడ్డారు. విశాఖపట్నంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రులు, మాజీ మంత్రులు, ప్రజాప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో జీవో నెంబర్ 3ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం, రెండేళ్ల పాలన పూర్తయినా ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, గిరిజన యువత స్వచ్ఛందంగా చేపడుతున్న ఉద్యమాలపై అక్రమ కేసులు బనాయిస్తూ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 3 రద్దు అంశంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటని, గత ప్రభుత్వంలో సుప్రీం కోర్టులో దాఖలు చేసిన రివ్యూ పిటిషన్ వివరాలను ప్రెస్ ముఖంగా బహిర్గతం చేశారు. ఇప్పటికైనా జీవో నంబరు 3 పై ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గిరిజనుల తరపున పోరాటం తప్పదని ..మిగతా 8లో

## వెనుకబాటులో మంత్రులు


### శాఖల పనితీరు మార్చుకోవాలి

### రెండేళ్ల విజయాలపై ప్రెస్ మీట్లతో సరిపెట్టారు

### ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకువెళ్లలేదు

### క్రమం తప్పకుండా అంశాలపై సమీక్షలు చేయాలి

### కేబినెట్‌లో మంత్రులకు చంద్రబాబు క్లాస్



(అమరావతి - జయజయహే)

మంత్రులు తమ శాఖల పనితీరుపై మరింత దృష్టి సారించాలని సీఎం సూచించారు. చాలా అంశాల్లో మంత్రులు వెనుకబడిపోతున్నారని సీఎం అన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించిన తర్వాత, ఆ అంశంపై ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకుని ప్రజలకు వివరించాలని ..మిగతా 2లో



## నేడు దేశవ్యాప్త నిరసనలు

### నీట్ పేపర్ లీక్‌కు కేంద్రానిదే బాధ్యత

### కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు

2



## మళ్లీ కరోనా కలకలం

### 32కి చేరిన పాజిటివ్ కేసులు

### సాధారణ పరిస్థితులేనంటున్న వైద్యులు

2

### 'శాశ్వత నో మైనింగ్ జోన్'గా

# జీఓ విడుదల చేయాలి

### జీఓ విడుదలయ్యే వరకు వైఎస్సార్‌సీపీ ఉద్యమం ఆగబోదు

### పార్లమెంట్‌లోనూ పంచదార్ల అక్రమ మైనింగ్ పై చర్చకు పెడతాం

### కేంద్ర మంత్రి గజేంద్ర షెకావత్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేస్తాం

### ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ రాజకీయ గుండు గీస్తాం..

### సీఎం రమేశ్ ఎక్కడ నుంచి వచ్చారో అక్కడకే పంపుతాం

### వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ హెచ్చరిక

(విశాఖపట్నం - జయజయహే)

అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పంచదారల క్షేత్రాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే 30 కిలోమీటర్ల పరిధిని శాశ్వత నో-మైనింగ్ జోన్‌గా ప్రకటిస్తూ జీవో విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రభుత్వ మాజీ విప్, కరణం ధర్మశ్రీ డిమాండ్ చేశారు. జీవో వెలువడే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజలతో కలిసి ..మిగతా 8లో



## ఉత్తరాంధ్రలో ముందే పెన్షన్లు

### 30న పంపిణీకే ప్రభుత్వం నిర్ణయం

### భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవమే కారణం

2

## మూడు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

### పలు ప్రవేశ, పోటీ పరీక్షల పేపర్ లీకేజీపై విచారణ

### విద్యార్థులకు హాని తలపెట్టేవారిని వదిలిపెట్టం

### ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలు, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనలతో రాజకీయ వాతావరణం అత్యంత వేడెక్కిన వేళ.. దేశ యువతను ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. వివిధ ప్రవేశ, పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిపై వేగవంతమైన విచారణ జరిపి, కఠినంగా శిక్షించేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వివరించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధాని గురువారం ఉదయం ఈ విషయాన్ని పంచుకుంటూ, దేశ యువత భవిష్యత్తు, సంక్షేమం కంటే తమకు ..మిగతా 2లో



For a pure tomorrow..
జయహో

# స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...**

వైయస్ జగన్, అనంతరం ఒక్కో నియోజకవర్గ సమన్వయకర్తతో విడివిడిగా సమావేశమయ్యారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, కమిటీల ఏర్పాటు, క్షేత్రస్థాయి సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, భవిష్యత్ కార్యాచరణపై సమగ్రంగా సమీక్షించారు.

**స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకమైనవని, వాటిని ప్రతి నాయకుడు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని వైయస్ జగన్ స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా ఎదుర్కొనేందుకు పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి స్థానంలో పార్టీ పోటీచేసి విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని, అందుకు అనుగుణంగా క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. పార్టీ ముఖ్య నాయకులంతా ఇప్పటి నుంచే పూర్తి బాధ్యత తీసుకుని గ్రామస్థాయి నుంచి పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేయాలన్నారు.

పార్టీ కమిటీలకు ఆగస్టు 15 నుంచి గుర్తింపు కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభమవుతుందని వైయస్ జగన్ వెల్లడించారు. కమిటీల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని నాయకులను ఆదేశించారు. కమిటీల్లో ఉత్సాహవంతులు, చురుకైన నాయకులు, పార్టీ కోసం అంకితభావంతో పనిచేసేవారంతా ఉండి గుర్తింపు కార్డుల పంపిణీకి అన్ని గ్రామాలు వెళ్ళి సమావేశాలు నిర్వహించాలి, నాలుగు నెలల పాటు నియోజకవర్గ సమన్వయకర్తలు గ్రామాలు, వార్డులలో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ కమిటీలకు



గుర్తింపు కార్డులు పంపిణీ చేయడంతో పాటు ప్రజాసమస్యలపై గళం వినిపించాలి

అనుబంధ విభాగాల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీకి పటిష్టమైన నెట్‌వర్క్ సిద్ధమైందని చెప్పారు. ఆయా విభాగాల్లో చురుగ్గా పనిచేస్తున్న నాయకులను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కూడా తమకు కేటాయించిన ప్రాంతాల్లో ఎక్కువ సమయం వెచ్చించి, సమన్వయకర్తలు, స్థానిక నాయకత్వంతో కలిసి పనిచేయాలని సూచించారు.

**ప్రతి గ్రామంలో సమావేశాలు నిర్వహించాలి**

ప్రతి గ్రామంలో నియోజకవర్గ సమన్వయకర్తల ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించాలని వైయస్ జగన్ ఆదేశించారు. ఈ సమావేశాల్లో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలతో పాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించాలన్నారు. ఇదంతా పార్టీ క్యాడర్‌కు ప్రజలకు వివరించాలి

కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను పార్టీ క్యాడర్‌కు వివరించాలని సూచించారు. స్థానిక నాయకత్వం ప్రజలకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, సమస్య వచ్చినప్పుడు వెంటనే స్పందించి అండగా నిలవాలని స్పష్టం చేశారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి**

ఎస్ఐఆర్‌కు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితా విడుదలైన తర్వాత కూడా పార్టీ నాయకులు, బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని వైయస్ జగన్ సూచించారు. ముసాయిదా జాబితా విడుదలతోనే ప్రక్రియ పూర్తయినట్లు భావించకూడదన్నారు. ఓటర్ల జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే లేవనెత్తి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకపోతే ఫారం--6 ద్వారా చేర్పించాలని, అనర్హుల పేర్లపై ఫారం--7 ద్వారా అభ్యంతరాలు తెలియజేయాలని, వివరాల్లో మార్పులు, సవరణల కోసం ఫారం--8ను ఉపయోగించాలని సూచించారు. ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.

**ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలి**

రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైయస్ జగన్ పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం, ప్రతిపక్షం గొంతునొక్కడం, అక్రమ కేసులు పెట్టడం, రాజకీయ వేధింపులకు పాల్పడడంపైనే దృష్టి పెట్టిందని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతోందన్న సందేశం ప్రతి కార్యకర్తకు, ప్రతి కుటుంబానికి చేరాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నాయకులకు వైయస్ జగన్ దిశానిర్దేశం చేశారు.

# ఎల్ నినోపై అప్రమత్తంగా ఉండాలి

**మొదటి పేజీ తరువాయి...**

రూ.25 వేల చొప్పున సహాయం అందించేందుకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ఏళ్లలోపు ఉన్న బీపీఎల్ పరిధిలోని చేనేత కుటుంబాలకు ఈ ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రంలో 3,168 ప్రభుత్వ ఉద్యోగాల అంశంపై మరిన్ని వివరాలతో సమగ్ర అధ్యయనం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ ప్రతిపాదనలను మంత్రివర్గ ఉపసంఘం పరిశీలించి, తదుపరి భేటీలో సమర్పించాక తుది నిర్ణయం తీసుకోనున్నారు. బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో వినికిడి లోపం ఉన్న విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నేరడి బ్యారేజీ నిర్మాణ పనుల కోసం రూ.641.10 కోట్ల పరిపాలనా అనుమతులకు ఆమోదం లభించింది. అలాగే హంద్రీ-నీవా రెండో దశ పనుల అంచనా వ్యయాన్ని రూ.241.20 కోట్ల నుంచి రూ.312 కోట్లకు పెంచేందుకు ప్రభుత్వం ఓకే చెప్పింది. గోదావరి పుష్కరాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్ల కోసం రూ.50 కోట్లు విడుదల చేసేందుకు ఆమోదముద్ర పడింది. శ్రీకాకుళంలో బ్రహ్మకుమారీస్ సంస్థకు మున్సిపల్ స్థల లీజు పొడిగింపునకు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులకు, ఏపీ మార్క్‌ఫెడ్ కోసం సెంట్రల్ బ్యాంక్ నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ గ్యారంటీ ఇచ్చేందుకు కేబినెట్ సమ్మతించింది. రాష్ట్రంలో ఎల్‌నినో వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా, పశువులకు తాగునీరు, మేత కొరత తలెత్తకుండా మంత్రులు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎల్‌నినో హెచ్చరికలను, ప్రభుత్వం తీసుకుంటున్న ఉపశమన చర్యలను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని కోరారు. మరోవైపు ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలతో మెగా డీఎస్సీ అంశాన్ని ముడిపెట్టి ప్రతిపక్ష వైసీపీ రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తోందని, నిరాధార వివాదాలను సృష్టించే వారి కుట్రలపై మంత్రులు జాగ్రత్తగా ఉండాలని చంద్రబాబు హెచ్చరించారు. పాలనలో మంత్రులు మరింత చురుగ్గా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు సూచించారు. పొగాకు ధరల వంటి సున్నితమైన అంశాల్లో ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం ఇవ్వకుండా, ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న నిర్ణయాలను ముందుగానే ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు, కలెక్టర్లు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అనేక ఏళ్లుగా 22ఏ నిషేధిత జాబితాలో ఉండి, ఇటీవల ప్రభుత్వం వెసులుబాటు కల్పించిన భూముల అంశాన్ని ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజలకు స్పష్టంగా వివరించాలన్నారు ముఖ్యమంత్రి. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఆమోదించిన ప్రాజెక్టులు, ప్లానింగ్ బోర్డు సమావేశాల నిర్వహణపై జిల్లాల వారీగా సమీక్షలు చేపడుతూ ప్రగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

# వెనుకబాటులో మంత్రులు

**మొదటి పేజీ తరువాయి...**

ఆదేశించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, కలెక్టర్ కలిసి పనిచేస్తే అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఇద్దరూ కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలిలో ఆమోదం పొందిన ప్రాజెక్టులను జిల్లా స్థాయిలో సమీక్షించాలని సీఎం ఆదేశించారు. అలాగే ప్లానింగ్ బోర్డు సమావేశాలను తరచూ నిర్వహిస్తూ, అభివృద్ధి పనులపై క్రమం తప్పకుండా సమీక్షలు చేయాలని సూచించారు. 'మీ శాఖల్లో ఉన్న సమస్యలను మీరే పరిష్కరించే విధంగా చొరవ చూపాలి. రెండేళ్ల ప్రభుత్వ విజయాలపై మంత్రులు మీడియా సమావేశాలు నిర్వహించినప్పటికీ, వాటిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయారు' అని చెప్పుకొచ్చారు. పలాసలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన ఘటన, తిరుపతిలో ఆంజనేయస్వామి విగ్రహం చోరీ కేసుల్లో సీసీటీవీ కెమెరాల ఆధారంగా నిందితులు దొరికిపోయారని ముఖ్యమంత్రి చెప్పారు. డీఎస్సీ పరీక్షల అంశంలో ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ప్రజలు నమ్మలేదని, కోర్టులోనూ వారికి అనుకూల ఫలితం రాలేదని వ్యాఖ్యానించారు. ఈ అంశాన్ని ఢిల్లీలో జరిగిన నీట్ ఉద్యమంతో ముడిపెట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇలాంటి అంశాల్లో మంత్రులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గోదావరి పుష్కరాలు, పోలవరం ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని ఒకే రోజు నిర్వహించే అంశంపై కేబినెట్‌లో చర్చ జరిగింది. పోలవరం ప్రాజెక్టు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సీఎం పేర్కొన్నారు. పోలవరం ప్రారంభోత్సవం, గోదావరి పుష్కరాల ప్రారంభ కార్యక్రమాలను విడివిడిగా నిర్వహిస్తే బాగుంటుందని మంత్రి నిమ్మల రామానాయుడు సమావేశంలో చెప్పినట్లు సమాచారం.




# ఉత్తరాంధ్రలో ముందే పెన్షన్లు

## 30న పంపిణీకే ప్రభుత్వం నిర్ణయం

## భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవమే కారణం

**(అమరావతి - జయజయహే)**

ఉత్తరాంధ్ర జిల్లాల పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం శుభవార్త అందించింది. సాధారణంగా జరిగే తేదీ కంటే రెండు రోజుల ముందుగానే పెన్షన్ల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. భోగాపురం అల్లూర అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉత్తరాంధ్ర జిల్లాల్లో జూలై 30వ తేదీనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11.98 లక్షల మంది లబ్ధిదారులకు రూ.514.42 కోట్ల మేర ముందస్తు పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో జూలై 30వ తేదీనే పెన్షన్ల పంపిణీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆరు జిల్లాల్లో మొత్తం 11.98 లక్షల మంది లబ్ధిదారులకు రూ.514.42 కోట్ల మేర పెన్షన్ నగదు అందించనున్నారు. ఈ నేపథ్యంలోనే పెన్షన్ పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జూలై 29వ తేదీలోగా అవసరమైన నగదు ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులకు సమయానికి పెన్షన్ అందేలా గ్రామ, వార్డు స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భోగాపురం అల్లూరి ఎయిర్‌పోర్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పరిపాలనా ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలోనే పెన్షన్లను ముందుగానే పంపిణీ చేయడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆర్థికంగా వెసులుబాటు కలగనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా , ఆగస్టు 1వ తేదీన భోగాపురం అల్లూరి ఎయిర్‌పోర్ట్ ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ముస్తాబుతోంది.

# మూడు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు

**మొదటి పేజీ తరువాయి...**



ఏదీ ముఖ్యం కాదని స్పష్టం చేశారు. "పేపర్ లీక్‌లకు పాల్పడిన వారికి వేగంగా, అత్యంత కఠినమైన శిక్ష పడేలా చూసేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని మేము నిర్ణయించాము. ఈ విషయమై తక్షణమే తగిన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు, విభాగాన్ని ఆదేశించాను," అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తమ ప్రభుత్వం వరుసగా తీసుకుంటున్న నిర్ణయాల్లో ఇది ఒక భాగమని ప్రధాని వెల్లడించారు. "మన యువత భవిష్యత్తుతో ఆడుకోవడానికి, హాని తలపెట్టడానికి ప్రయత్నించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు," అని మోదీ హామీ ఇచ్చారు. ఒకవైపు ప్రధాని మోదీ ప్రకటనలు వస్తుండగా, మరోవైపు దేశ రాజధానిలో యువత, విద్యార్థుల ఆందోళనలు తీవ్రరూపం దాల్చాయి. 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఆధ్వర్యంలో వేలాది మంది విద్యార్థులు, రాజకీయ నాయకులు దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద భారీ నిరసనను కొనసాగిస్తున్నారు.




# నేడు దేశవ్యాప్త నిరసనలు

## నీట్ పేపర్ లీక్ కు కేంద్రానిదే బాధ్యత

## కాక్రోచ్ జనతా పార్టీ పిలుపు

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత వహించాలంటూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జులై 24న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చింది. ఇటీవలి జంతర్‌మంతర్-పార్లమెంటు ర్యాలీ సందర్భంగా యువతపై పోలీసుల కర్కశత్వాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిరసనకు పిలుపునిచ్చినట్టు తెలిపింది. ఈ కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు, ఇతర ఏర్పాట్లకు సిద్ధం కావాలని యువతను కోరింది. పేపర్ లీక్ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ మరో నిరసన కార్యక్రమానికి సిద్ధం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిరసన కార్యక్రమానికి కావాల్సిన అనుమతులు పొందేందుకు, ఏర్పాట్లు చేసేందుకు విద్యార్థి సంఘాలు, యూత్ ఆర్గనైజేషన్లు కలిసి పనిచేయాలని సీజేపీ పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీక్ అంశంలో సీజేపీ డిమాండ్స్ గురించి ఈ నిరసనల్లో బహిరంగంగా చదవాలని పేర్కొంది. బాధితులకు సంఘీభావంగా ఇంక్విలాబ్ జిందాబాద్, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేయాలని కూడా సూచించింది. నిరసనల్లో కేవలం సానుకూల నినాదాలను మాత్రమే చేయాలని చెప్పింది. ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొంది. నిరసనకు అనుమతి ఉన్న ప్రాంతాలకే పరిమితం కావాలని, ట్రాఫిక్‌కు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని సూచించింది. రెచ్చగొట్టే చర్యలకు స్పందించవద్దని కూడా పేర్కొంది. ఇక నీట్ ఉదంతంపై విచారణ కోసం కేంద్రం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే.

# మళ్లీ కరోనా కలకలం

## 32కి చేరిన పాజిటివ్ కేసులు

## సాధారణ పరిస్థితులేనంటున్న వైద్యులు

**(అమరావతి - జయజయహే)**

కరోనా వైరస్ బాధితుల సంఖ్య పెరగడంతో ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఏపీలో పాజిటివ్ కేసుల సంఖ్య 32కి చేరడంతో ఈ ఇన్ఫెక్షన్ తీవ్రత ఎంతవరకు ఉంది? తిరిగి మాస్కులు ధరించాల్సిన సమయం వచ్చిందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశాలపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నేషనల్ కోవిడ్ టాస్క్ ఫోర్స్ కో-ఛైర్మన్ డాక్టర్ రాజీవ్ జయదేవన్ స్పందిస్తూ.. ఇది ఆసుపత్రులు నిండిపోయి, ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే రకం వేవ్ కాదని స్పష్టం చేశారు. 'కోవిడ్-19 వైరస్ క్రమానుగత వ్యవధిలో వ్యాపించే తత్వం కలిగి ఉంటుంది. అందుకే కేసులలో పెరుగుదల కనిపించడం సాధారణమే. ఒమిక్రాన్ వేవ్ వచ్చిన 2022 తర్వాత నుంచి మన ఆరోగ్య వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి తెచ్చే స్థాయి ఘటనలేవీ నమోదు కాలేదు.' అని ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి ఏడాదీ ఇలాంటి తాత్కాలిక పెరుగుదల చూస్తున్నామని, ఇది కూడా మరో రెండు నెలల్లో తగ్గిపోతుందని వివరించారు. వైరస్ వేరియంట్ల గురించి వివరిస్తూ.. 2021లో డెల్టా, 2022లో ఒమిక్రాన్ ప్రభావం చూపాయని తెలిపారు. ఆ తర్వాత వచ్చిన వేరియంట్లన్నీ ఒమిక్రాన్ సంతతికి చెందినవేనని పేర్కొన్నారు. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ, పూణే నిర్వహించిన జీనోమ్ సీక్వెన్సింగ్‌లో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఐదు నమూనాలలో ఆర్ ఎఫ్.5 సబ్-లైనేజ్ ను గుర్తించారు. ప్రస్తుతం గుర్తించిన ఆర్ ఎఫ్ .5 తో సహా వచ్చిపోయే ఉప-వేరియంట్లన్నీ ఒమిక్రాన్ ఉత్పన్నాలేనని, వీటి పేర్లు వేరైనా వీటి లక్షణాలు ఒకేలా ఉంటాయని, ఏదీ కూడా మరొకదాని కంటే తీవ్రమైన వ్యాధిని కలిగించదని వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తులకు ఈ సబ్-లైనేజ్ వల్ల ప్రాణాపాయం లేకపోయినా, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాధారణ జ్వరం కూడా గుండెపై ఒత్తిడి తెస్తుందని, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల రద్దీగా ఉండే ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని సూచించారు. మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఎ. విష్ణు వర్ధన్ మాట్లాడుతూ.. సింగపూర్, ఆగ్నేయాసియా దేశాల్లో ఆర్ ఎఫ్ .5 కేసులు ఎక్కువగా నమోదయ్యాయని, అయితే ఇది ప్రమాదకరమైనది కాదని చెప్పారు. గొంతు నొప్పి, దగ్గు, జ్వరం, తలనొప్పి, ముక్కు కారడం లేదా మూసుకుపోవడం, నీరసం, ఒళ్లు నొప్పులు దీని ప్రధాన లక్షణాలని తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ సంబంధిత అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో టెస్టింగ్ కిట్లు, మందులు, కోవిడ్ ప్రత్యేక బెడ్లు, పీపీఈ కిట్లు, అత్యవసర వైద్య సామాగ్రి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే స్వల్ప లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# అట్టడుగు నుంచి... అంతరిక్ష ప్రయోగానికి

**మొదటి పేజీ తరువాయి...**

దరఖాస్తు చేసుకున్నారు. పలు కఠినమైన దశల ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్న జెస్సీ.. భారత్ నుండి ఎంపికైన ప్రతిష్టాత్మక 20 మంది బాలికల తుది జాబితాలో స్థానం సంపాదించింది .ఒక సాధారణ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అంతర్జాతీయ స్థాయిలో ఈ గుర్తింపు సాధించడం ద్వారా జెస్సీ మన జిల్లాకే కాకుండా రాష్ట్రమంతటికీ గర్వకారణంగా నిలిచింది మిషన్ శక్తి శాట్‌కు కందుల జెస్సీ ఎంపిక కావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేకంగా ట్వీట్ చేస్తూ ఆమెను అభినందించారు.అంతరిక్ష రంగంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సత్తా ఏంటో చాటిచెప్పిన కందుల జెస్సీ విజయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు, స్థానిక ప్రజలు హర్షంవ్యక్తం చేస్తున్నారు. జెస్సీ సాధించినఈ విజయం ప్రభుత్వ పాఠశాలవిద్యార్థులకు స్ఫూర్తిదాయకంగానిలుస్తుందని అభిప్రాయపడుతున్నారు.జెస్సీ మరిన్ని ఉన్నత శిఖరాలుఅధిరోహించాలని పలువురు అభినందనలు తెలిపారు.ఆమె విజయం ధవళేశ్వరం పేరునుజాతీయ స్థాయిలో నిలబెట్టడమేకాకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల ప్రతిభను మరోసారి దేశానికి చాటిచెప్పింది.

# మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

## అవగాహన ర్యాలీలో కిమ్స్ ఐకాన్ న్యూరో వైద్యులు

**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే**

ప్రపంచ మెదడు సందర్భంగా షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. ఓల్డ్ గాజువాక సర్కిల్ వద్ద మెదడు ఆరోగ్యం, బ్రెయిన్ స్ట్రోక్ నివారణ , సకాలంలో చికిత్స యొక్క ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. చీఫ్ న్యూరో ఫిజీషియన్ డా. పుష్ప విజయ్, డా. మానస, న్యూరో సర్జన్ డా. కె. ఎ. నాయుడు, డా. రేవంత్, డా. జగదీష్ హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు, గోల్డెన్ అవర్‌లో చికిత్స పొందాల్సిన అవసరం, మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. స్ట్రోక్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా సమీపంలోని నిపుణుల ఆసుపత్రికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక ట్రాఫిక్ సీఐ ఎస్.కె. హుస్సేన్, సీఐ వాసు నాయుడు, ఎసఐ శాంతారామ్, ఎసఐ రాధాకృష్ణ హాజరై కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి చేపట్టిన ఈ ప్రజా చైతన్య కార్యక్రమాన్ని అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని




వారు పేర్కొన్నారు. కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సీఓఓ, మార్కెటింగ్ జనరల్ మేనేజర్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్లకార్డులతో ప్రజల్లో అవగాహన కల్పించారు.



## చినుకు పడక వరి పంట వాడింది

### రైతు గుండెల్లో ఆవేదన రగులుతుంది

**టెక్కలి జూలై 23 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లాలో చివారు గ్రామాల తో పాటు టెక్కలి నియోజకవర్గంలోని రైతులకు ఏడాది పాటు బతుకు బాటకు జీవనాధారమైన వరి చేను నారుమల్లు ఎండిపోయి రైతుల గుండెల్లో గుబులు పుడుతుంది, వర్షాకాలం లో కురవాల్సిన వర్షాలు తీవ్ర ఎద్దడితో వరి నారుమళ్లు చినుకు లేక ప్రత్యామ్నాయ సాగునీరు లేక వరి చేలు మొక్క దశలోనే ఎండిపోవడంతో రైతులు నానాయాతనకు గురవుతున్నారు. టెక్కలి నియోజకవర్గం లో నందిగాం, కోటబొమ్మాలి, సంతబొమ్మాలి, టెక్కలి గ్రామీణ ప్రాంతశీ లో చిగురించిన చేను మళ్ళు వాడిపోవడంతో పలువురు రైతులు ట్రాక్టర్ల ట్యాంకర్లతోనూ, సమీపంలోని గడ్డల నుంచి నీటి ఇంజన్ పైపుల ద్వారా, మరి కొంతమంది కావిడితో నీళ్లు మోసి వరి చేను పొలాలను నీళ్లతో తడిపి పంట పొలాలను కాపాడుకునే ఉన్నారు. వర్షపు నీటిపైనే ఆధారపడ్డ పొలాలు ప్రత్యామ్నాయం లేక రైతులు దిగాలు పడుతున్నారు. సంబంధిత వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

## టెక్కలిలో ఆధునిక సులాబ్ కాంప్లెక్స్

### ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మాణం పూర్తి

### మంత్రి కింజరాపు అచ్చన్న సంకల్పంతో సిద్ధం

**టెక్కలి జూలై 23 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి లో ఎప్పటినుంచో స్థానికులు, ప్రయాణికులు, పర్యాటకుల విజ్ఞప్తుల మేరకు టెక్కలి పట్టణం ఆధునీకరణలో భాగంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు సంకల్పంతో ప్రజల సౌకర్యార్థం ఇందిరాగాంధీ కూడలి వద్ద అధునాతన హంగులతో అందరికీ ఉ పయోగపడేలా సు లాబ్ కాంప్లెక్సను కూటమి ప్రభుత్వం సిద్ధం చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా మౌలిక అవసరాల్లో భాగమైన ఇటువంటి నిర్మాణాలు మహిళలు, పురుషులు, పిల్లలు, వృద్ధులకు చాలా అవసరమని ఇటువంటి నిర్మాణాలకు




ప్రజలు స్వాగతిస్తున్నారు, అతి త్వరలోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేయనున్నారు. ఈ సులాబ్ కాంప్లెక్స్ ను స్వచ్ఛభారత్ నిధులతో నిర్మాణ పనులను త్వరితగతిన జరుగుతున్నాయి, ఆర్ డబ్ల్యు ఎస్ డి ఈ ఎస్ రామకృష్ణ, ఏ ఈ మోహన్, గుత్తేదారులు ధోని కొండలరావు, పంచాయితీ అధికారుల పర్యవేక్షణలో నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి.



## రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ విశాఖ కేంద్రంగా ఉండాలి

**అనకాపల్లి జయ జయహే**

విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ఉన్నచోటే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ ఏర్పాటు కావాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ను ఆంధ్రప్రదేశ్ లోక్సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీసెట్టి బాబి అయినను కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు కొణతాల రామకృష్ణ ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ గా ఉన్న ఆయన ఆధ్వర్యంలో లోక్సత్తా సిపిఐ సిపిఎం ప్రజా సంఘాలు ఆనాడు చేసిన ప్రజా ఉద్యమంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చి దక్షిణ కోస్తా నుండి విడదీసి సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేశాయని, గత నెల జూన్ 1 నుండి పరిపాలన కార్యక్రమాలు కూడా విశాఖపట్నంలో ప్రారంభం కావడం చాలా ఆనందంగా ఉందని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బీ సెట్టి బాబ్జి పేర్కొన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల విశాఖపట్నం రావలసిన రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్ (ఆర్ఆర్ బి )ని అమరావతిలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం చాలా బాధ కలిగించిందని దీని వలన ఉత్తరాంధ్రలోని యువతకి తీరని అన్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా ఆధ్వర్యంలో త్వరలోనే దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం చేపడతామని ముందుగా ఉత్తరాంధ్రలోని ఎమ్మెల్యేలు ఎంపీలు మంత్రులను కలిసి చంద్రబాబుతో పాటు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెమ్మని అలాగే వినతి పత్రాల అందరికీ అందజేస్తామని ఆగస్టు మొదటి వారంలో విశాఖపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తామని రైల్వే జోన్ ప్రధాన కేంద్రం ఎక్కడ ఉంటుందో అక్కడే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు ఉండటం సమంజసమని ఇది దేశవ్యాప్తంగా ఇదే పద్ధతి కొనసాగుతున్నదని వారు పేర్కొన్నారు ప్రజాప్రతినిధులు ఈ విషయంపై తమ గొంతు విప్పాలని ఆయన విజ్ఞప్తి చేయడం జరిగింది.

## ఇండియా స్కిల్స్ పోటీలకు దరఖాస్తు చేసుకోండి

**చోడవరం జూలై 23 జయ జయహే**



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండియా స్కిల్స్ పోటీలకు అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ పి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ..దేశంలోని యువతలో దాగి ఉన్న వృత్తి నైపుణ్యాలను వెలికితీసి, వారిని జాతీయ స్థాయిలో ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అతిపెద్ద వేదిక స్కిల్ ఇండియా అన్నారు. వివిధ రంగాల్లో పట్టున్న అభ్యర్థులకు ఇది వారి ప్రతిభను నిరూపించుకోవడానికి అద్భుతమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు, ప్రముఖ నిపుణుల ద్వారా అత్యుత్తమ ప్రత్యేక శిక్షణ లభిస్తుంది. జాతీయ స్థాయిలో సత్తా చాటిన విజేతలు అంతర్జాతీయ వేదికపై జరిగే 'వరల్డ్ స్కిల్స్' పోటీలలో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం దక్కించుకుంటారన్నారు. పూర్తి వివరాలకు 9494791935 నెంబర్ను సంప్రదించాలన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే**

సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా వి ఎం ఆర్ డి ఎ, నేరెడ్కో సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారం వి ఎం ఆర్ డి ఎ చిల్డ్రన్ ఏరినాలో జరిగిన ఈ శిబిరాలను ప్రారంభించిన సందర్భంగా చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ రక్తదానం చేయటం అంటే ప్రాణదానం చేసినట్లే అని పేర్కొన్నారు. సాటి మనిషి ప్రాణాలు కాపాడటంలో రక్తదానానికి మించింది లేదన్నారు. మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ వి ఎం ఆర్ డి ఎ సహకారంతో నేరెడ్కో ఇలాంటి రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేయటానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఆయన స్ఫూర్తితో పలువురు వి ఎం ఆర్ డి ఎ ఉన్నతాధికారులు కూడా స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరంలో వి ఎం ఆర్ డి ఎ ఉన్నతాధికారులు కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా 365 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో టీడీపీ విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు పట్టాభిరామ్, నేరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు చక్రధర్ , ప్రతినిధులు రమేష్ బాబు , హుస్సేన్, పాపారావు, సుబ్బారావు, పరశురామయ్య, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.






## కాశి అయోధ్య యాత్ర విజయవంతం

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ ప్రజల ఆధ్యాత్మిక ధార్మిక చైతన్యాన్ని పెంపొందించే సదుద్దేశంతో పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ వారి నేతృత్వంలో కాశీ అయోధ్య రైలు తీర్థయాత్ర కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆ యాత్ర ముగించుకుని గురువారం తీర్థయాత్ర ప్రయాణీకులతో అనకాపల్లికి రైలు విజయవంతంగా చేరుకోవడం జరిగిందని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆనంద వ్యక్తం చేశారు ఈ సందర్భంగా అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు కాశీ అయోధ్య పుణ్యక్షేత్ర యాత్రకు ఎంపీ సీఎం రమేష్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సుమారు 1400 మంది భక్తులను ఉచితంగా పుణ్యక్షేత్ర దర్శనం కల్పించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు అక్కడ నుండి వచ్చిన భక్తులు అనకాపల్లి స్థానిక రైల్వే స్టేషన్లో కొణతాల రామకృష్ణ వారిని కలిసి యాత్ర విశేషాలు అడగడం జరిగింది భక్త ప్రయాణికులు ఎక్కడ ఇబ్బందులు కలగలేదని ప్రయాణం బాగానే జరిగిందని దేవాలయం దర్శనాలు అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కూడా మాతోపాటు దేవాలయాల దర్శనం చేసుకున్నారని భక్తుల ఆనందంతో చెప్పడం జరిగింది. అలాగే భోజనాలు అల్పాహారం అన్ని బాగానే ఏర్పాట్లు జరిగాయని వారు పేర్కొన్నారు. మరో దప కాశి అయోధ్య రైలు వేసేందుకు అందుకు భక్తులు కూడా ఆసక్తి చూపుతున్నారని, అవకాశం లభించిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో కూడా ఇటువంటి ఆధ్యాత్మిక యాత్ర నిర్వహించేందుకు కృషి చేస్తామని ఈ పూర్తి క్రెడిట్ ఎంపీ సీఎం రమేష్ కె చెందుతుందని దాదాపు 5 దశాబ్దాలకు క్రితం అనకాపల్లి నుంచి వస్తారా దక్షిణ భారత పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక రైలు యాత్రలు నిర్వహించిన చరిత్రను కొణతాల రామకృష్ణ గుర్తు చేస్తూ అంతటి స్థాయిలో మళ్లీ ఆధ్యాత్మిక యాత్ర నిర్వహించడం అనకాపల్లి ప్రజలకు శుభ పరిణామం అని వారు పేర్కొన్నారు




## 12 ఏళ్ల సేవకు 12000 జీతమా

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న మల్టీ పర్సన్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు గత 12 సంవత్సరాలుగా నిరంతర సేవలు అందిస్తున్నప్పటికీ నెలకు కేవలం 12000 వేతనం, 3000 ఇన్సెంటివ్ మాత్రమే ఇస్తున్నారని వారు వాపోయారు గురువారం స్థానిక నాలుగు రోడ్ జంక్షన్ లో బస్టాప్ వద్ద నిరసన దీక్ష శిబిరం చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమం అనంతరం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిపిఆర్ఓ కు కలిసి వినతి పత్రం అందజేసే, ఆ అనంతరం దీక్ష చేస్తున్న నిరసనకారులకు మద్దతుగా ఏఐటియుసి రాష్ట్ర సమితి సభ్యుడు కోనా లక్ష్మణ్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలు కుటుంబ పోషణ ఖర్చులు భారంగా మారిన ఈ సమయంలో ఇంత తక్కువ వేతనంతో జీవించడం అసాధ్యమని అంతేకాకుండా గత నాలుగు నెలలుగా జీతాలు కూడా అందకపోవడంతో అప్పులు చేసి తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారని వారి ఆవేదన వ్యక్తం చేశారు తమ సమస్యలను గత 12 ఏళ్లుగా ప్రభుత్వ అధికారులుకు,ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకు వస్తున్నప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆయన ఆరోపించారు దీంతో గత్యంతరం లేక ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లేందుకు సహాయ నిరాకరణ ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు వారు ప్రకటించారు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ నెలకు 35000 వేతనం వారికి ఇవ్వాలని శాశ్వత ఉద్యోగ భద్రత కల్పించాలని నాన్ సాంక్షన్ పోస్టులను సాంక్షన్ పోస్టులుగా మార్చాలని ఈ హెచ్ ఎస్ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని ప్రమాద భీమా విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎస్ గ్రేషియా అందించాలని మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్స్ మంజూరు చేయాలని 12 ఏళ్లుగా సేవలు చేస్తున్న గౌరవప్రదమైన వేతనం ఇవ్వటం లేదని ఆ కుటుంబాలు ఎలా పోషించాలని అంటూ వారు ప్రశ్నించారు ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేసి పెండింగ్ జీతాలు విడుదల చేయడంతో పాటు వేతనాలు పెంపు ఉద్యోగ భద్రత తక్షణ నిర్ణయం ప్రకటించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కోరుబిల్లి జగదీష్, వంగ సింహాచలం, ఏ ఈ ఓ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కే బి సూర్యనారాయణ,పబ్లిక్ సిటీ కార్యదర్శి మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం శ్రావణ సంధ్య,కోశాధికారి ఎం రామారావు, పి ప్రశాంత్ కుమార్, వి జయ నాగదేవి, పి సంతోష్, టి రాజా, ఎం రంగనాథ్, ఆర్ సుజాత తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ పథకాలకు ఆలయ నిధులు ఖర్చు చేయడం దుర్మార్గం

**అనకాపల్లి జయ జయహే**



దేవాలయ నిధులు ధార్మిక కార్యక్రమాలకు వేద విద్యకు ధర్మ ప్రచారానికి మాత్రమే ఖర్చు చేయవలసి ఉండగా ఈ ప్రభుత్వం ప్రభుత్వ సంక్షేమ పథకాలకు వెచ్చించడం అన్యాయమని చట్ట విరుద్ధం అవుతుంది కూడా అనకాపల్లి జిల్లా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ డి డి నాయుడు పేర్కొన్నారు నిధులు ఒక కులానికి కొన్ని మతాలకు చెందినవి కావని హిందువులకు అన్ని కులాలకు చెందినవని అన్ని కులాల వారు హుండీలో దక్షిణలు కానుకలు భక్తులు దర్శనం పూజలు నిమిత్తం కొన్ని టికెట్లు రూపంలో వచ్చే ధనం మరియు ఇతర ఆదాయాలు ద్వారా సమకూరిన ఆదాయం సమకూర్తుండగా ఒక కార్పొరేషన్ పేరుతో ప్రభుత్వం ఖర్చు చేయడం తప్పని తల్లికి వందనం స్కీం కొరకు దేవాదాయ శాఖ ద్వారా డబ్బు తీసుకోవడం విశ్వహిందూ పరిషత్ దీనికి పూర్తిగా వ్యతిరేకమని ప్రభుత్వం 19వ తేదీన జారీచేసిన 1243 ఆర్డర్ను వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన పంచదారల కొండను మైనింగ్ నిషిద్ధ ప్రాంతంగా ప్రకటించినందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి అభినందనలు తెలియజేశారు ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఆ జీవోను నిలువుదల చేయాలని వారు కోరారు

For a pure tomorrow.. జయహే



## 18వ ఇషా గ్రామోత్సవానికి మంత్రి మండిపల్లికి ఆహ్వానం

అమరావతి (జయ జయహే)

సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని ఇషా ఫౌండేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి 18వ ఇషా గ్రామోత్సవం -- ఆంధ్రప్రదేశ్ డివిజనల్ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆగస్టు 9న గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.

## హెల్త్ వాలంటీర్లను తక్షణమే నియమించాలి

డుంబ్రిగూడ, జూలై 24: జయ జయహే.




అల్లూరి జిల్లా పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో అనారోగ్యాలకు గురవుతూ తరచుగా జరుగుతున్న గిరి విద్యార్థుల మరణాలను దృష్టిలో ఉంచుకొని తక్షణమే హెల్త్ వాలంటీర్లను నియమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరి విద్యార్థుల ఆరోగ్యాల పై ప్రత్యేక దృష్టి సారించి గతంలో హెల్త్ వాలంటీర్లను నియమించారన్నారు. విద్యార్థులకు చిన్నపాటి జలుబు, దగ్గు ,జ్వరం ,వచ్చిన, వెంటనే హెల్త్ వాలంటీర్లు స్థానికంగా పాఠశాలల్లో అందుబాటులో ఉంటూ హాస్పిటల్ కు తరలించి వైద్య సేవలు అందించేవారన్నారు. దీంతో విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందడంతో వ్యాధులబారిన పడకుండా ముందస్తుగా నివారించేవారన్నారు. హెల్త్ వాలంటీర్లను తొలగించడంతో ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల మరణాల సంఖ్య ప్రతి యేడాది జరుగుతూనే ఉన్న హెల్త్ వాలంటీర్లను నియమించడంలో ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, ఆదివాసి గిరిజన విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించి గిరిజన విద్యార్థుల మరణాలకు అడ్డుకట్ట వేయాలని ఆయన డిమాండ్ చేశారు. .


# అవయవదానం.. అమృత జీవనానికి మార్గం

(ప్రతాప్)

**"దేహం నశించినా దానం చేసిన అవయవాలు మరెందరిలోనో జీవిస్తాయి" అనే భావనకు ప్రతిరూపమే అవయవదానం. మనిషి మరణం ఒక కుటుంబానికి తీరని విషాదమే అయినా, మెదడు మరణం చెందిన వ్యక్తి అవయవాలు పలువురికి పునర్జన్మను ప్రసాదించగలవు. అందుకే అవయవదానాన్ని మానవత్వానికి అత్యున్నత రూపంగా, మహాదానంగా భావిస్తారు. ఒక దాత గుండె, కాలేయం, రెండు మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, ప్యాంక్రియాస్, కంటి కార్నియాలు వంటి అవయవాలు, కణజాలాలను దానం చేసి ఏడుగురు నుంచి ఎనిమిది మంది వరకు ప్రాణాలను కాపాడగలడు.**



భారత్‌లో అవయవ మార్పిడి అవసరం రోజురోజుకూ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ పరిధిలోని జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ (NOTTO) గణాంకాల ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా 20,019 అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. అయినప్పటికీ 2026 మార్చి నాటికి 89,839 మంది రోగులు అవయవాల కోసం నిరీక్షణ జాబితాలో ఉన్నారు. అవసరానికి తగినంత అవయవాలు లభించక ప్రతి సంవత్సరం వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ లోటును పూడ్చగల శక్తి సమాజంలో అవయవదానంపై చైతన్యం పెరగడంలోనే ఉంది.



ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు చేపట్టింది. జాతీయ అవయవ మార్పిడి కార్యక్రమం (National Organ Transplant Programme - NOTP) ద్వారా దేశవ్యాప్తంగా అవయవ మార్పిడి మౌలిక సదుపాయాలను విస్తరించడం, =ాయిూ (ప్రాంతీయ సంస్థలు), ాయిూ (రాష్ట్ర సంస్థలు) ఏర్పాటు చేసి సమన్వయ వ్యవస్థను బలోపేతం చేయడం జరిగింది. అలాగే 'అంగదాన్ జనజాగృతి అభియాన్' పేరుతో దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. డిజిటల్ రిజిస్ట్రీ, అవయవ కేటాయింపులో పారదర్శకత, మెదడు మరణాల తప్పనిసరి నివేదికలు, ట్రాన్స్‌ప్లాంట్ సమన్వయకర్తల నియామకం, రోడ్డు ప్రమాద బాధితుల నుంచి అవయవదాన అవకాశాలను పెంచేందుకు ఫస్ట్ రెస్పాండర్లకు ప్రత్యేక శిక్షణ వంటి చర్యలు కూడా అమలు చేస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న జీవందాన్ కార్యక్రమం దేశంలోనే ఆదర్శప్రాయమైన అవయవదాన వ్యవస్థగా గుర్తింపు పొందింది. గ్రీన్ కారిడార్ ఏర్పాట్లు, శాస్త్రీయ అవయవ కేటాయింపు, పారదర్శక విధానాలు, వైద్య బృందాల సమన్వయం వల్ల అనేక మంది రోగులకు కొత్త జీవితం లభిస్తోంది. ఇటీవల మెదడు మరణం చెందిన ఒక నిర్మాణ కార్మికుడి కుటుంబం తీసుకున్న అవయవదాన నిర్ణయం ఏడుగురికి జీవనవెలుగులు నింపడం ఈ కార్యక్రమం విలువను మరోసారి చాటిచెప్పింది.

అయితే ఇంకా సమాజంలో అపోహలు, అవగాహన లోపం, కుటుంబ సభ్యుల సంకోచం కారణంగా అనేక అవయవాలు వృథా అవుతున్నాయి. మతపరంగా కూడా అవయవదానాన్ని సేవాభావంతో కూడిన పుణ్యకార్యంగానే చాలా మంది ఆధ్యాత్మికవేత్తలు అభివర్ణిస్తున్నారు. పాఠశాలలు, కళాశాలలు, వైద్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా కలిసి అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి. డ్రైవింగ్ లైసెన్స్, ఆరోగ్య నమోదు వంటి సందర్భాల్లో అవయవదాన ప్రతిజ్ఞకు మరింత ప్రోత్సాహం కల్పించాలి. ప్రతి కుటుంబంలో ఈ అంశంపై ముందుగానే చర్చించే సంస్కృతి పెంపొందాలి. మరణానంతరం కూడా మరొకరికి జీవించే అవకాశం ఇవ్వడం కన్నా గొప్ప దానం లేదు. అవయవదానం ఒక వ్యక్తి జీవితానికి ముగింపు కాదు; అనేక జీవితాలకు కొత్త ఆరంభం. నిజంగా అది అమృత జీవనానికి మార్గం.


# భారత్‌లో ముంచుకొస్తున్న హృద్రోగాల ముప్పు

(ప్రతాప్)

ఒకప్పుడు వృద్ధాప్యంతో ముడిపడిన హృద్రోగాలు ఇప్పుడు యువతను సైతం వదలడం లేదు. మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిడి, మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం, కాలుష్యం వంటి కారణాలతో దేశంలో గుండె సంబంధిత వ్యాధులు వేగంగా విస్తరిస్తున్నాయి. అంటువ్యాధుల కంటే అంటువ్యాధులు కాని వ్యాధులే ఇప్పుడు భారత ప్రజారోగ్యానికి అతిపెద్ద సవాలుగా మారగా, అందులో హృద్రోగాలే అగ్రస్థానంలో నిలవడం ఆందోళన కలిగించే పరిణామం.

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా మరణాలకు ప్రధాన కారణం హృద్రోగాలే. భారత్‌లో నమోదవుతున్న మొత్తం మరణాల్లో సుమారు 28 శాతం గుండె సంబంధిత వ్యాధుల వల్లే సంభవిస్తున్నాయి. దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 30 లక్షల గుండెపోటు (స్టెమీ) కేసులు నమోదవుతున్నట్లు భారత వైద్య పరిశోధన మండలి (ఐ సి ఎం ఆర్ ) వెల్లడించింది. ప్రపంచ హృద్రోగ మరణాల్లో దాదాపు ఐదో వంతు భారత్‌లోనే సంభవిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే భారతీయుల్లో గుండెపోటు గతంతో పోలిస్తే తక్కువ వయసులోనే వస్తోంది.



ఇటీవలి భారత వైద్య పరిశోధన మండలి చేపట్టిన ఒక స్వతంత్ర అధ్యయనం మరో ప్రమాద ఘంటిక మోగించింది. దేశంలోని వయోజనుల్లో దాదాపు 90 శాతం మందికి కనీసం ఒక రకమైన కొవ్వు (లిపిడ్) అసమతుల్యత ఉన్నట్లు గుర్తించింది. అధిక కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు, మధుమేహం, రక్తపోటు, అధిక బరువు కలిసి గుండెజబ్బులకు బలమైన పునాది వేస్తున్నాయి. నగరీకరణతో పాటు శారీరక శ్రమ తగ్గడం, ఫాస్ట్‌ఫుడ్ వినియోగం పెరగడం, నిద్రలేమి, ధూమపానం, మద్యం అలవాట్లు, నిరంతర మానసిక ఒత్తిడి ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

గుండెజబ్బులలో అత్యంత ప్రమాదకరమైన అంశం ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడమే. చాలామందికి అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ సమస్యలు ఉన్నా అవగాహన లేకపోవడం వల్ల పరీక్షలు చేయించుకోరు. ఫలితంగా గుండెపోటు వచ్చిన తర్వాతే వ్యాధి బయటపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నిపుణుల కొరత, అత్యవసర చికిత్సకు ఆలస్యం, సమయానికి ఆసుపత్రికి చేరుకోలేకపోవడం మరణాల రేటును పెంచుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత వైద్య పరిశోధన మండలి చేపడుతున్న "హృదయ సేతు" వంటి అత్యవసర చికిత్సా నమూనాలు ప్రాణరక్షణలో ఆశాజనక ఫలితాలు ఇస్తున్నాయి.

ఈ ముప్పును ఎదుర్కోవాలంటే చికిత్స కంటే నివారణకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవాలి. రోజుకు కనీసం అరగంట నడక లేదా వ్యాయామం, సమతుల్య ఆహారం, ఉప్పు-చక్కెర-ట్రాన్స్‌ఫ్యాట్ వినియోగ నియంత్రణ, ధూమపానం-మద్యపానానికి దూరంగా ఉండడం, ఒత్తిడిని తగ్గించే జీవనశైలి అలవాటు చేసుకోవడం అత్యవసరం. పాఠశాలల నుంచి కార్యాలయాల వరకు గుండె ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, కుటుంబ వైద్య పరీక్షలను అలవాటుగా మార్చడం, అత్యవసర గుండెపోటు లక్షణాలపై ప్రజలకు శిక్షణ ఇవ్వడం కాలానుగుణ అవసరం. హృదయాన్ని కాపాడుకోవడం వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాదు, దేశ ఆరోగ్య భవిష్యత్తును రక్షించే సామాజిక కర్తవ్యమని ప్రతి భారతీయుడు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైంది.



## త్రాగునీటి సమస్య పరిష్కరించినందుకు గ్రామంలో ప్రజలు ఆనంద వ్యక్తం

### అగాపే లవ్ అండ్ కేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బూదరాళ్లలో చేతిపంపు ఏర్పాటు...

### సంస్థ డైరెక్టర్ అరవింద్ శ్రీమతి హెప్సీబా

కొయ్యూరు :(జయ జయహే )న్యూస్ జులై 24,

అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలం బూదరాళ్ల గ్రామంలో అగాపే లవ్ అండ్ కేర్ సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చేతిపంపును ఘనంగా ప్రారంభించారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని గుర్తించిన సంస్థ, స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు వెంటనే స్పందించి ఈ చేతిపంపును ఏర్పాటు చేసి తాగునీటిని అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్య అతిథుల చేతుల మీదుగా ప్రారంభం ఈ చేతిపంపును సంస్థ డైరెక్టర్ అరవింద్ మరియు శ్రీమతి హెప్సీబా ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజల కష్టాలను తీర్చడమే మా సంస్థ ముఖ్య ఉద్దేశం. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న బూదరాళ్ల గ్రామ ప్రజలకు ఈ చేతిపంపు ద్వారా ఉపశమనం లభించడం సంతోషంగా ఉంది. కాలినడకన దూరప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి నుండి విముక్తి కల్పించి, తమ ఊరిలోనే సురక్షితమైన తాగునీటిని అందించినందుకు బూదరాళ్ల గ్రామ ప్రజలు అగాపే లవ్ అండ్ కేర్ సేవా సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ సూపర్వైజర్లు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# గిరిజనులతో ఆటలాడితే ఊరుకునేది లేదు..!

**- జీవో నెంబరు 3, 1/70 యాక్ట్ పై వైసీపీ కన్నెర్ర**

**- గిరిజనులను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం**

**- ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్‌సీపీ గిరిజన నేతలు**



**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే :**

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉండాల్సిన కూటమి ప్రభుత్వం అబద్ధాల ప్రచారంతో కాలయాపన చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన నేతలు మండిపడ్డారు. విశాఖలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను బొందపెట్టి, అధికారంలోకి వచ్చాక కళ్ల బొల్లి మాటలతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. జీవో నెంబర్ 3 విషయంలో అసలు వాస్తవాలు గిరిజన సోదరులకు తెలియాలని, 2002లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సుప్రీంకోర్టులో కేసులు 3609/2002, 7040/2002) పడ్డాయని, 18 ఏళ్ల సుదీర్ఘ వాదనల అనంతరం 2020 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు జీవో 3ని రద్దు చేసిందన్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి, 2020 జూన్ 18న 111వ ఏపీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసి, జులై 13న సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందన్నారు. 2024 ఏప్రిల్‌లో ఏపీ ప్రభుత్వ రివ్యూ పిటిషన్‌తో పాటు మరో 15 రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసిందని గుర్తు చేశారు. . మేము రివ్యూ పిటిషనే వేయలేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదే పదే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. మీ సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న ఐఏఎస్ అధికారులు, లా సెక్రటరీలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయలేదని చెప్పించే దమ్ము కూటమి ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. స్వచ్ఛందంగా రోడ్డెక్కిన ఏజెన్సీ యువతకు జీవో 3పై నాలెడ్జ్ లేదనడం, వారిని వైఎస్సార్‌సీపీ ప్రలోభపెట్టిందని అనడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనన్నారు. వైయస్.జగన్ హయాంలోనే ఎస్టీ కమిషన్‌ను వేరు చేశాం, సచివాలయం, వాలంటీర్ ఉద్యోగాలన్నీ స్థానిక గిరిజనులకే ఇచ్చామన్నారు. 3.22 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చి 1.70 లక్షల మంది రైతులకు మేలు చేశాం. ఐదేళ్లలో రూ.20,000 కోట్లు గిరిజన సంక్షేమానికి ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి జీవో 3ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర మాట్లాడుతూ కూటమి నాయకులు అబద్ధాలు చెప్పి ఎన్నికల్లో గెలిచారని, 2002లో జీవో నెంబర్ 3పై సుప్రీం కోర్టులో పిటిషన్ పడినప్పుడు చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి అని, 2002 నుండి 2004 వరకు ఆయనే లాయర్లను పెట్టారు. మేము అధికారంలోకి వచ్చాక కూడా ఆ లాయర్లనే కొనసాగించాం. మరి ఆ రోజే చంద్రబాబు హయాంలో సమర్థవంతమైన వాదనలు ఎందుకు వినిపించలేదని నిలదీశారు. మా హయాంలో గిరిజన సంఘాలు, యువత ధర్నాలు చేస్తే మానవత్వంతో ఆలోచించి ఎవరిపైనా కేసులు పెట్టలేదు. కానీ ఈ రోజు హక్కుల కోసం పోరాడుతున్న 15-25 మంది గిరిజన యువతపై కేసులు పెడుతున్నారు. ఇది ప్రజా ప్రభుత్వమా లేక ముస్సోలిని తరహా నియంత ప్రభుత్వమా? రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వమే ఉంది కాబట్టి, కేంద్రంతో మాట్లాడి లేదా ప్రత్యేక చట్టం తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అరకు ఎమ్మెల్యే రేగ మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్ రావు తదితరలు మాట్లాడుతూ గిరిజనుల హక్కులను, గిరిజన చట్టాల జోలికొస్తే ఊరుకునేది లేదన్నారు. 100శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలని తెచ్చిన జీవో 3 రద్దును రాజకీయంగా వాడుకుని చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇంకా 'స్టడీ చేస్తున్నాం' అని సాకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు ప్రతి ఒక్కరూ జీవో 3 విషయంలో అబద్ధాలను ప్రచారం చేస్తున్నారున్నారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు 1700 మంది నాన్-ట్రైబ్స్ 1/70 యాక్ట్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లారంటే దీని వెనుక కూటమి నేతల ప్రోద్బలం ఉందనేది స్పష్టమవుతోందన్నారు. పాడేరులో 15 వేల నుంచి 20 వేల మంది గిరిజన యువకులు స్వచ్ఛందంగా వచ్చి ర్యాలీ చేశారు తప్ప వైఎస్సార్‌సీపీ రెచ్చగొట్టలేదని, గిరిజనులను మోసం చేయడం ఆపి, వారి గోడును వినాలన్నారు. మాజీ మంత్రి పసుపులేటి.బాలరాజు మాట్లాడుతూ లక్షలాది మంది ఆదివాసీ, గిరిజన ప్రజల రాజ్యాంగ చట్టబద్ధమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికల హామీ మేరకు జీవో నంబరు 3ని పునరుద్ధరించాలి. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా హామీని అమలు చేయకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లడం సరికాదు. ఇప్పటికైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి.

# చిన్నారి వైద్యానికి వాసుపల్లి రూ.20 వేల సాయం

**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి చొరవతో కేజీహెచ్‌లో చికిత్స**

**విశాఖపట్నం, జూలై 22, జయ జయహే :**



పుట్టినప్పటి నుండి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ చొరవతో పదేళ్ల వరకు అవసరమైన వైద్యాన్ని కేజీహెచ్ డాక్టర్స్ ద్వారా విజయవంతంగా అందించారు. అంతేకాకుండా ఇంటికి వెళ్లి పరామర్శించి సొంత నిధులతో రూ.20 వేల నగదును మెడికల్ ఖర్చులకు అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ కేజీహెచ్ సూపరిండెంట్ సహకారంతో కిడ్నీ వైద్య నిపుణులు గులిపిల్లి ప్రసాద్ బృందం పర్యవేక్షణలో ఆరేళ్ల బాబు వంక గగన్ కి ప్రాణదానం చేశారని హర్షం వ్యక్తం చేశారు. కిడ్నీ మార్పిడి అనేది చిన్న వయసుల్లో బాబుకి సహకరించదని, ప్రస్తుతానికి ట్యూబ్ ద్వారా పదేళ్ల వరకు బాబుకి ఆరోగ్యవంతమైన జీవనం సాగించేలా విజయవంతమైన వైద్యం అందించిన డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. బాబు తల్లిదండ్రులు వంక నరేష్ వంక అమ్మాజీ నిరుపేద కుటుంబం కావడంతో వారికి అవసరమైన మందులు ఖర్చులకు తన వంతు సాయం అందించానని వెల్లడించారు. బాబు ఆరోగ్యం పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. కానీ కూటమి ప్రభుత్వంలో అది జరగడం లేదని విమర్శించారు. చంద్రబాబుకు, లోకేష్ కేవలం కక్షపూరిత రాజకీయాలతో రగిలిపోతున్నారని మండిపడ్డారు. ప్రజలంతా గమనిస్తున్నారని భవిష్యత్తులో మళ్లీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతో మంచి రోజులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఎస్సీ సెల్ ప్రెసిడెంట్,మాజీ కార్పొరేటర్ చెన్నా జానకిరామ్,జిల్లా వైస్సార్సీపీ వైస్ ప్రెసిడెంట్ రేయ్ డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గనగళ్ల రామరాజు, జిల్లా సెక్రటరీ బొడ్డు ఆనంద్, జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్ గుంటు ఆనంద్, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైఎసఆర్సిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# వీఎంఆర్‌డీఏలో శాసన సభ పీఏసీ నేతల సమీక్ష

**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే :**



వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ నేతృత్వంలో సమగ్ర వివరాలు సమర్పణ ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు అధ్యక్షతన వీఎంఆర్‌డీఏ వివరాల సమర్పణపై సమీక్షా సమావేశం జరిగింది. గురువారం జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎమ్మెల్యేలు విష్ణు కుమార్ రాజు, బి.రామాంజనేయులు, రామ్ రాజు గోపాల్, కే.లలిత కుమారి, ఏజీ కార్యాలయం నుంచి డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ సాయి కృష్ణ రెడ్డి, జాయింట్ సెక్రటరీ విజయరాజు , వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ తదితర అధికారులు పాల్గొని చర్చించారు. వి ఎం ఆర్ డి ఎ ద్వారా భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి కార్మిక సెస్ వసూళ్ల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకున్నారని, సెస్ వసూళ్లపై అంతర్గత సమీక్ష వివరాలు, వసూలు చేసిన సెస్ బదలాయింపు అంశాలపై చర్చించారు. వీటికి సంబంధించి వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ భరత్ నేతృత్వంలో ప్రధాన ప్రణాళిక అధికారిణి దివ్యలత వివరాలు అందించారు. భవన నిర్మాణానికి సంబంధించిన దరఖాస్తులు ఆయా స్థానిక సంస్థల నుంచి రాగా, వాటికి వి ఎం ఆర్ డి ఎ ద్వారా భవన నిర్మాణాలకు కేవలం సాంకేతిక అనుమతులు మాత్రమే ఇవ్వటం జరిగిందని, కార్మిక సెస్ వసూళ్ళు, వాటి బదలాయింపు వంటివి ఆయా స్థానిక సంస్థలు పర్యవేక్షణలో ఉన్నాయని వివరించారు. ఐతే ఆయా స్థానిక సంస్థలు కార్మిక సెస్ వసూళ్ల పై సమగ్ర వివరాలతో నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు వి ఎం ఆర్ డి ఎ లే అవుట్ల అభివృద్ధి చేసిన తర్వాత రైతులకు కేటాయించిన స్థలాల విషయంలో ఉన్న న్యాయపరమైన అంశాలపై చర్చించారు. అనంతరం వి ఎం ఆర్ డి ఎ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ మాట్లాడుతూ కోర్టు పరిధిలో ఉన్న అంశాలను తెలియజేశారు. కార్యక్రమంలో వి ఎం ఆర్ డి ఎ అదనపు కమిషనర్ దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి దయానిధి, కార్యదర్శి మురళీ కృష్ణ, ఓ ఎస్ డి కృష్ణ నాయక్, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్, డి ఎఫ్ ఓ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, సభ్యులను వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ సత్కరించారు.

# భోగాపురం ప్రారంభ సన్నాహక వేడుకలు... పరిశీలించిన బీజేపీ చీఫ్ మాధవ్



**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే**

అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం భోగాపురం ఎయిర్పోర్ట్ వద్ద ప్రారంభ వేడుకల ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ గురువారం పరిశీలించారు. ఆగస్టు 1న ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా విమానాశ్రయం జాతికి అంకితం చేస్తారు. ఈ సందర్భంగా మాధవ్ విలేకరులతో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయానికి ముందు అల్లూరి సీతారామరాజు భారీ విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ఎయిర్ పోర్ట్‌లో ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, ఉత్తరాంధ్ర జానపద కళారూపాలు, ప్రతిమలు ఏర్పాటు చేశారన్నారు. ప్రారంభ వేడుకలో ప్రజలను భాగస్వామ్యం చేసే కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆగస్టు 1న ఉదయం 11 గంటలకి ప్రధాని మోదీచే ప్రారంభ వేడుక ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజలతో సభా కార్యక్రమాలు నిర్వహిస్తామని, భోగాపురం ఎయిర్పోర్టులో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



# 'డిబిటి జమకు ఇక నో టెన్షన్'

**రాజమహేంద్రవరం : జయ జయహే : జూలై 23:**


ధవళేశ్వరం కొత్తపేట వీధి నెం.11 అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ప్రధానమంత్రి మాతృ వందన యోజన అమలులో భాగంగా అర్హత కలిగిన గర్భిణీ మహిళలకు ప్రభుత్వం డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.5,000 ఆర్థిక సహాయాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.అయితే, కొందరు లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు లేకపోవడం లేదా సాంకేతిక కారణాల వల్ల డిబిటి నగదు జమ కాకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో పోస్టాఫీస్ బ్యాంకు అధికారులుప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా అర్హులైన గర్భిణీ మహిళలకు పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించి, అవసరమైన పత్రాలను పరిశీలించి, డిబిటి నగదు సక్రమంగా జమ అయ్యేలా సహకారం అందించారు.కార్యక్రమంలో పోస్టాఫీస్ బ్యాంకు మేనేజర్ సాగర్ బాబు, సిబ్బంది ప్రవీణ్, శ్రీదేవి, నాగమణి పాల్గొని గర్భిణీ మహిళలకు ప్రధానమంత్రి మాతృ వందన యోజన వివరాలను వివరించారు. అలాగే ఖాతా ప్రారంభం నుంచి డిబిటి ప్రక్రియ పూర్తయ్యే వరకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యక్ష బాధ్యతల్లో గణేషుల చక్రవర్తి

**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 23**



కడియం ఆంధ్ర--తెలంగాణ రాధా--రంగా మిత్రమండలి కడియం మండల ఉపాధ్యక్షుడిగా కడియం గ్రామానికి చెందిన గణేషుల చక్రవర్తిఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జి ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి అభినందించారు.వంగవీటి మోహన రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న చక్రవర్తికి ఈ బాధ్యతలు దక్కడం పట్ల అభిమానులు, కాపు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దివంగత వంగవీటి రంగాతో చక్రవర్తి కుటుంబానికి ప్రత్యేక అనుబంధం ఉంది. ఆయన తండ్రి గణేషుల రమణ మండలంలో రంగా మిత్రమండలి కార్యకలాపాల్లో కీలకంగా వ్యవహరించడంతో పాటు, కడియం మండలంలో తొలిసారిగా రంగా విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రముఖ పాత్ర పోషించారు. తండ్రి సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ చక్రవర్తి ఈ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా గణేషుల చక్రవర్తిమాట్లాడుతూ.. "తనపై నమ్మకం ఉంచి మండల ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కాళ్లపాలెం బుజ్జికి కృతజ్ఞతలు. రాధా--రంగా ఆశయాలకు అనుగుణంగా మండలంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ, యువతను సంఘటితం చేసి మిత్రమండలిని బలోపేతం చేసేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తాను అని తెలిపారు.తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్తారంటూ పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



# ఘనంగా 'పెద్ది' 50 రోజుల వేడుకలు

**విజయనగరం :(జయ జయహే)**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన "పెద్ది" చిత్రం ఘన విజయం సాధించి, 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయనగరంలో మెగా అభిమానులు హంగామా చేశారు. విజయనగరం జిల్లా చిరంజీవి యువత, రామ్ చరణ్ యువశక్తి మరియు మెగా యూత్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎన్.సి.ఎస్ థియేటర్ వద్ద గురువారం ఈ సంబరాలు మిన్నుముట్టాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనసేన పార్టీ నాయకులు గురాన అయ్యలు - రాధిక దంపతులు హాజరయ్యారు. థియేటర్ ప్రాంగణానికి చేరుకున్న అతిథులకు, అభిమానులకు భారీగా బాణాసంచా కాల్చి, కోలాహలంగా ఘనస్వాగతం పలికారు. అనంతరం అభిమానుల నినాదాల మధ్య గురాన అయ్యలు దంపతులు ప్రత్యేక కేక్ కట్ చేసి 50 రోజుల విజయాన్ని జరుపుకున్నారు.ఈ సందర్భంగా గురాన అయ్యలు మాట్లాడుతూ.. "పెద్ది" చిత్రం బాక్సాఫీస్ వద్ద సాధించిన బ్లాక్ బస్టర్ విజయం మెగా అభిమానుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపిందన్నారు. అనంతరం 50 రోజుల పాటు చిత్రాన్ని విజయవంతంగా ప్రదర్శించిన ఎన్.సి.ఎస్ థియేటర్ సిబ్బందిని అభిమాన సంఘాల నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అక్కడకు విచ్చేసిన అభిమానులకు, ప్రజలకు పెద్ద ఎత్తున స్వీట్లు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో జిల్లా చిరంజీవి యువత, రామ్ చరణ్ యువశక్తి, మెగా యూత్ ఫోర్స్ నాయకులు, ప్రతినిధులతో పాటు భారీ సంఖ్యలో మెగా ఫ్యామిలీ అభిమానులు, జనసేన శ్రేణులు పాల్గొని థియేటర్ పరిసరాలను పండుగ వాతావరణంగా మార్చేశారు.

# తూర్పు ప్రాంతాన సౌర ప్రగతి

### 88,561 మందికి 475.33 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు

### 197.09 మెగావాట్లు గ్రిడ్‌కు అనుసంధానం

### ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్

**విశాఖపట్నం, జూలై 23, జయ జయహే**



ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) పరిధిలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు వేగంగా విస్తరిస్తోందని, ఈ ఏడాది జూన్ 30 నాటికి సంస్థ పరిధిలో మొత్తం 88,561 మంది వినియోగదారులు 475.33 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసి గ్రిడ్‌తో అను-సంధానించారని ఏపీఈపీడీసీఎల్ ఛైర్మన్ ఌ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ తెలిపారు. గత నాలుగు ఆర్థిక సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణలో ఏపీఈపీడీసీఎల్ ప్రతి ఏడాది గణనీయమైన పురోగతిని నమోదు చేసిందని ఆయన పేర్కొన్నారు. 2022-23లో 864 మంది వినియోగదారులకు సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు ద్వారా 17.39 మెగావాట్లు, 2023-24లో 980 సోలార్ సిస్టమ్స్ ద్వారా 30 మెగావాట్లు, 2024-25లో 8,307 సోలార్ సిస్టమ్స్ ద్వారా 70.25 మెగావాట్లు, 2025-26లో రికార్డు స్థాయిలో 51,583 సోలార్ సిస్టమ్స్ ద్వారా 197.09 మెగావాట్లను గ్రిడ్‌తో అనుసంధానం చేసినట్లు తెలిపారు. ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 51,583 రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటుతో 197.09 మెగావాట్ల సామర్థ్యాన్ని నమోదు చేసి, ఏపీఈపీడీసీఎల్ చరిత్రలో అత్యధిక వార్షిక ప్రగతిని సాధించిందని సీఎండీ పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన వినియోగంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహనతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహక పథకాలపై విశ్వాసం పెరగడమే ఈ విజయానికి ప్రధాన కారణమని ఆయన అన్నారు. రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకునే వినియోగదారులకు అవసరమైన సాంకేతిక సహకారం, గ్రిడ్ అనుసంధానం, నెట్ మీటరింగ్ ప్రక్రియలను వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేస్తున్నామని పృథ్వీతేజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద 1 కిలోవాట్‌కు రూ.30,000, 2 కిలోవాట్లకు రూ.60,000, 3 కిలోవాట్లకు రూ.78,000 వరకు సబ్సిడీ అందిస్తోందని తెలిపారు. అర్హులైన 2 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 2 కిలోవాట్ల సామర్థ్యం గల రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, కాకినాడ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల గృహ వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేసుకోవాలని సీఎండీ పిలుపునిచ్చారు. రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్ బిల్లుల భారం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే హరిత విద్యుత్ ఉత్పత్తిలో ప్రతి వినియోగదారుడు భాగస్వామి కావచ్చని ఆయన పేర్కొన్నారు.



## విద్యార్థినులకు ఆరోగ్య అవగాహన సదస్సు

**శ్రీకాళహస్తి, జులై 23,జయ జయహే**

శ్రీకాళహస్తి ఎం జి ఎం హాస్పిటల్స్ భరత్ హాస్పిటల్ వారు సంయుక్తంగా రోటరీ క్లబ్ వారి సహకారం తో ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ విద్యార్థినులకు ఆరోగ్య సంబంధిత పలు విషయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఆరోగ్య అవగాహనా సదస్సులో ఆడపిల్లలు ఋతు క్రమ సమయంలో తీసుకువలసిన జాగ్రత్తలు మరియు వారికి కావలసిన ఆరోగ్య సలహాలను హాస్పిటల్స్ స్త్రీ సంబంధిత వైద్య నిపుణురాలు డాక్టర్ ముని రాజ్య లక్ష్మి తెలియ జేశారు. భరత్ హాస్పిటల్ డాక్టర్ లు డాక్టర్ భరత్,డాక్టర్ దీపిక లు విద్యార్థినులకు కావలసిన పలు సూచనలను అందించారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు ఇలాంటి మంచి విషయాలపై పలు సూచనలు, సలహాలు అందించిన హాస్పిటల్స్,భరత్ హాస్పిటల్ వారికి, శ్రీకాళహస్తి రోటరీ క్లబ్ మెంబెర్ లకు కళాశాల ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.



## సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ల పంపిణీకి సర్వం సిద్ధం

### మెగా పిటిఎం విజయవంతానికి ఏర్పాట్లు పూర్తి : హెచ్ఎం దేవదాస్

**డుంబ్రిగూడ, జూలై 23: జయ జయహే**

మండలం లోని కొర్రాయి పంచాయతీ పరిధిలోని ఎంపీపీ జంగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్ల పంపిణీ కార్యక్రమంతో పాటు మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ పిటిఎం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవదాస్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు యూనిఫాంలు, బూట్లు, స్కూల్ బ్యాగులు, బెల్టులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ విద్యా సామగ్రి విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు పాఠశాల హాజరు శాతాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మెగా పిటిఎం ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెరిగి విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత తోడ్పాటు లభిస్తుందని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ, తమ పిల్లల విద్యాభ్యాసానికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని అభినందించారు.



## ఘనంగా ద్రౌపదీ వస్త్రపహరణ ఉత్సవం

**శ్రీకాళహస్తి, జులై 23,జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అనుబంధాలయమైన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆరవ రోజు రాత్రి ద్రౌపదీ వస్త్రపహరణం ఉత్సవము ఊరేగింపు నిర్వహించారు. జూదం లో ధర్మరాజు ఓటమి తో నిండుసభలో ద్రౌపదీ వస్త్రపహరణ చేసే ఘట్టాన్ని పురస్కరించుకొని ఉత్సవం నిర్వహించారు.ద్రౌపదీ వస్త్రపహరణఉత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అమ్మవారిని పుర విహారం చేశారు.

## ఆర్టీసీ ప్రైవేటీకరణ ఆపాలని ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా

**శ్రీకాళహస్తి, జులై 23,జయ జయహే**




శ్రీకాళహస్తి పట్టణంలో అంబేద్కర్ కూడలి వద్ద రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆర్టీసీ విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణ విరమించుకోవాలని ఆర్టీసీని ప్రైవేటీకరణ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తిరుపతి జిల్లా ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ ,జిల్లా సబ్ కమిటీ మెంబర్ కత్తి రవి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య పాల్గొని వారు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణ పేరుతో ఆర్టీసీ సంస్థను ఆస్తులను ప్రైవేటు పరం చేయాలనే ప్రభుత్వ ఆలోచనను మానుకోవాలన్నారు. ఉద్యోగుల రక్షణ సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ బాధ్యతగా భావిస్తూ సమస్తకు విలువైన స్థలాలను డిపోలను కాపాడుకునే ఉద్దేశంతోనే ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో ధర్నా చేశామన్నారు. ప్రభుత్వానికిఆర్టీసీని ప్రైవేటుపరం చేయడం తప్ప వేరే ఆలోచన లేదని ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయని రాబడి తగ్గిందని వివిధ సాకులతోసమస్తను ప్రైవేటీకరించడానికి చూస్తున్నారన్నారు.ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి పథకం మహిళ ఉచిత ప్రయాణం రికార్డు స్థాయిలో సూపర్ డూపర్ హిట్ అయిందని ప్రభుత్వమే స్వయంగా వెల్లడించిందన్నారు.ఆర్టీసీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి లేనిపక్షంలో ఆర్టిసి ఉద్యోగులతో కలిసి ఏఐటియుసి అనుబంధ సంగాలైన కార్మిక వర్గాన్ని, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున రాష్ట్రవ్యాప్త ఉద్రిక్త ఉద్యమాల్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో అధికారులకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున్,నియోజకవర్గ అధ్యక్షులు కార్తీక్,భాను,రజాక్,సిపిఐ పట్టణ కార్యదర్శి రోడ్డ గోపి,ఏపీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి మహేంద్ర,మున్సిపల్ వర్కర్స్ నాయకులు హరి,జాన్,స్ట్రీట్ వండర్స్ నాయకులు జనార్దన్,మురళి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులతా ఏఐఎస్ఎఫ్ నాయకులు మునిచందు,నాయకులు దిలీప్,తొండు గోపి పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



## క్రీడాకారిణి జ్యోతి సురేఖని అభినందించిన మంత్రి మండిపల్లి

**అమరావతి జయ జయహే**

సచివాలయంలో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి ఛాంబర్ లో మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ని అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాను ఇటీవల సాధించిన వరల్డ్ కప్ లో సాధించిన పతకాల విశేషాలను మంత్రికి వివరించారు. ఆమె వెంట తండ్రి కూడా పాల్గొన్నారు.జ్యోతి సురేఖ వెన్నం సాధించిన విజయాలను మంత్రి అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించి యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడాకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.



## ప్రపంచ విజేత అన్మిష్ వర్మను అభినందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి (జయ జయహే)**

అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని ప్రపంచ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్, అంతర్జాతీయ పర్వతారోహకుడు అన్మిష్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సాధించిన విజయాలకు అన్మిష్ వర్మను మంత్రి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి భారతదేశానికి, ఆంధ్రప్రదేశ్‌కు మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు. యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంత్రి తెలిపారు.




## మహిళల హార్దిక సాధికారపు సహకార సంఘాలు కీలకపాత్ర

**చోడవరం జూలై 23 జయ జయహే**

చోడవరం ఎడ్ల వీధిలో నిర్వహించిన చోడవరం మహిళా పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘం 4వ మహాజనసభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళా సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక సాధికారతకు సహకార సంఘాలు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సంఘం నిర్వాహకులకు, సభ్యులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, సంఘం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యకలాపాలను వార్షిక నివేదికను సభకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్క్ ఈడి డి ఎస్ ప్రసాద్, సంస్థ ప్రతినిధులు పద్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు




## జనసేన ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుడు ఆజాద్ జయంతి

**శ్రీకాళహస్తి, జులై 23,జయ జయహే.**

శ్రీకాళహస్తి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలోభారతదేశ స్వాతంత్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన చంద్రశేఖర్ ఆజాద్ జయంతి ని ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకులు ఆజాద్ గొప్పదనాన్ని వివరించారు.కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేట చంద్రశేఖర్, పేట చిరంజీవి, గంధం శ్రీను, పసల సురేష్, మనీ, ప్రదీప్ కుమార్, ముని చంద్ర, చందు, రాజా, ముని కుమార్ వీర మహిళలు శ్రీకాళహస్తి టౌన్ బ్యాంక్ డైరెక్టర్ కవిత, ప్రసన్న, భారతి, వల్లి పాల్గొన్నారు.

# సమన్వయంతో గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

## 32 కి.మీ. మార్గంలో 7 జోన్లు, 28 సెక్షన్లు.. 7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

## గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై తుది విడత సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

## 28న ఆనందపురం నుంచి నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు

**విశాఖపట్నం, జూలై 23 , జయ జయహే**

ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. సుమారు 32 కిలోమీటర్ల మేర జరిగే గిరి ప్రదక్షిణకు 5 నుంచి 6 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్, భద్రత, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, విద్యుత్, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్లపై తుది విడత సమీక్ష కలెక్టరేట్ మీటింగు హాలులో గురువారం సాయంత్రం ఆయన అధ్యక్షతన జరగ్గా పలు అంశాలు చర్చకు వచ్చాయి. గిరి ప్రదక్షిణ మార్గాన్ని 7 జోన్లు, 28 సెక్షన్లుగా విభజించి ప్రతి సెక్షన్‌కు పోలీసు, జీవీఎంసీ అధికారులను ఇన్‌చార్జులుగా ఉండాలని పేర్కొన్నారు. 27వ తేదీ నుంచి 29వ తేదీ ఉదయం వరకు ఆరు షిఫ్టుల్లో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతి జోన్‌కు జోనల్ కమిషనర్, డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులను ఇన్‌చార్జులుగా నియమించి, సమగ్ర పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. తొలిపావంచ, అడవివరం జంక్షన్, హనుమంతువాక, అప్పుఘర్, మాధవధార, ఎనఎస్‌టీఎల్ గేట్, గోపాలపట్నం ప్రాంతాల్లో ఏడు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని, భక్తుల సౌకర్యార్థం 28 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి తాగునీరు, వాలంటీర్లు, వైద్య సిబ్బంది, భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని చెప్పారు. మొత్తం 31 వైద్య శిబిరాలు, 595 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయడంతో పాటు కొండపై అందుబాటులో ఉన్న మరుగుదొడ్లను కూడా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అప్పుఘర్ వద్ద భక్తుల కోసం షవర్ బాత్ సదుపాయం కల్పించాలని సంబంధిత అధికారులకు చెప్పారు.




**28న భారీ వాహనాలకు నగరంలోకి అనుమతి లేదు : జేసీ**

గిరి ప్రదక్షిణ ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించి జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆధ్వర్యంలో నియమించిన రెండు కమిటీలు రెండు అడ్వైజర్లను వెల్లడించాయి. 28న శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి ఆనందపురం జంక్షన గూండా నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదని జేసీ విద్యాధరి తెలిపారు. సబ్బవరం, అసకపల్లి, అనకాపల్లి కూడలి, లంకెలపాలెం నుంచి నగరంలోకి చేరుకోవాల్సి ఉంటుందని సూచించారు. అలాగే నగరం నుంచి శ్రీకాకుళం, విజయనగరం వెళ్లే భారీ వాహనాలు షీలానగర్, గాజువాక, లంకెలపాలెం, అనకాపల్లి కూడలి, అసకపల్లి, సబ్బవరం, ఆనందపురం మీదుగా వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నగరం లోపల ఆ రోజు మధ్యాహ్నం 2.00 గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. హనుమంతువాక నుంచి మద్దిలపాలెం వరకు 28వ తేదీ మధ్యాహ్నం 2.00 నుంచి అర్ధరాత్రి 12.00 గంటల వరకు నో వెహికల్ జోన్ అమలవుతుందన్నారు. బీచ్ రోడ్లోని కురుపాం జంక్షన్ నుంచి అప్పుఘర్ వరకు నో వెహికల్ జోన్ ఉంటుదని చెప్పారు. భీమిలి ప్రాంతం నుంచి వచ్చే వారు విశాఖ వ్యాలీ జంక్షన్ నుంచి హైవేకి చేరుకొని వెనక్కి తిరగాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ అడ్వైజరీని పోలీసు అధికారులు, భక్తులు, ప్రజలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. చివరిగా గిరి ప్రదక్షిణకు సంబంధించిన గీతాన్ని ప్రముఖుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, దేవస్థానం ఈవో జె. వెంకటరావు, పోలీసు, రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## హుండీ సొమ్ము రికవరీ..

# నిందితుల అరెస్టు

**చోడవరం జూలై 23 జయ జయహే**

ఈనెల 18 అర్ధరాత్రి సమయంలో చోడవరం పట్టణంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం శ్రీ రాములవారి దేవాలయాల్లో జరిగిన హుండీ చోరీ నేరాలకు పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ చేసిన సొమ్మును వసూలు చేసినట్టు చోడవరం పోలీసులు బుధవారం తెలిపారు. ఒక కేసులో 6000 రూపాయలు నగదు చోరీ కాగా, 2,859 రూపాయలు, మరో కేసులో చోరీ జరిగిన 1200 రూపాయలు రికవరీ చేసినట్టు తెలిపారు. నిందితులు చోడవరం అన్నవరం వెంకయ్య గారి పేట కు చెందిన జేడిపల్లి భూపతి, తమిళనాడుకు చెందిన వర కార్తిక్, విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నెల్లి లోకేష్ లు గా పేర్కొన్నారు. వీరిలో భూపతి పై గంజాయితోపాటు, ఒక చోరీ కేసు కూడా నమోదయి ఉందన్నారు. వీరిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్టు తెలిపారు. ఈ కేసును చోడవరం ఇన్స్పెక్టర్ పి. అప్పలరాజు, ఆధ్వర్యంలో ఎస్. ఐ లు బి. నాగ కార్తీక్, బి. జోగారావు, పి. సి సోమ శేఖర్, నరేంద్ర, హెచ్చీలు శ్రీను, కాశీ, బాలాజీ లు నిర్వీరమముగా కృషి చేసి పై ముద్దాయిలును పట్టుకొని 2 కేసులును చేదించినట్టు సీఐ అప్పలరాజు తెలిపారు.



## వారాహి మాత విగ్రహానికి

# లక్ష ఇరవై వేలు వివరాలు

**మాడుగుల జూలై 23 జయ జయహే**

మాడుగుల మండలం ఎం కోడూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న శ్రీ వారాహి మాత అమ్మవారి ఆలయ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా ఎంకోడూరు గ్రామానికి చెందిన గుమ్మాల నాయుడు లోవ లక్ష్మి దంపతుల కుమారుడు రిత్విక్ కుమార్, కుమార్తె జోష్ణ లు గురువారం 1,20,000 అమ్మవారి విగ్రహం నిమిత్తం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు ఆలయ అర్చకుడు శ్రీనివాస్ శర్మ ఎంపీటీసీ ముమ్మిన రమణ బాబు తదితరులు సమక్షంలో అందజేశారు. సందర్భంగా దాతలను అభినందించిన చైర్మన్, ఉత్తరాంధ్రలో వారాహి మాత అమ్మవారి గుడి ఎక్కడ లేదని ఒక యం కోడూరు గ్రామంలో నిర్మిస్తున్నామని కాబట్టి భక్తులు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



## ఎంపీడీఓ మురళి కుటుంబానికి

# మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**సూళ్లూరుపేట,జూలై 23, జయ జయహే:**

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సూళ్లూరుపేట ఎంపీడీఓ అవధానం మురళి కర్మదిన కార్యక్రమానికి సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరయ్యారు.ఈ సందర్భంగా మురళి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఆయన,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.అనంతరం మురళి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మురళి ప్రభుత్వ సేవలో ప్రజలకు ఎంతో నిబద్ధతతో సేవలందించారని,ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయుడుపేట టౌన్ అధ్యక్షుడు కలికి మాధవ్ రెడ్డి,ఓజిలి మండల అధ్యక్షుడు పాదర్తి హరినాథ రెడ్డి,నాయుడుపేట ఎంపీపీ కూరగుండ ధనలక్ష్మి,నాయుడుపేట టౌన్ కార్యదర్శి పెర్నాటి రాహుల్,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## పుష్కరిణి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

**చోడవరం జూలై 23 జయ జయహే**

భక్తుల సౌకర్యాలే మన లక్ష్యమనీ స్థానిక ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ రాజు అన్నారు. గురువారం చోడవరం పట్టణంలోని శివాలయం పుష్కర ఘాట్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించి, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.

## మూడు రోజుల పర్యటనకు విశాఖ చేరుకున్న

# మంత్రి మండిపల్లి

## విశాఖలో మంత్రికి ఘన స్వాగతం పలికిన ఆర్టీసీ, క్రీడా శాఖ అధికారులు.

**విశాఖపట్నం (జయ జయహే)**

మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విశాఖపట్నం చేరుకున్నారు. విశాఖ విమానాశ్రయంలో రవాణా శాఖ, ఆర్టీసీ, క్రీడా శాఖల ఉన్నతాధికారులు జేటీసీ శ్రీదేవి, డీటీసీ జయ ప్రకాశ్, ఎంఎం రాజారాం, డి ఎస్ డి ఓ మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.





## మునగాకు సాగుపై

# అవగాహన కార్యక్రమం

**బుచ్చయ్యపేట జయ జయహే**

మండలంలోని కొమ ల్లంపూడి కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం మునగ ఆకు సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు కే.ఎస్.ఎన్.ఎస్ రాజు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగాకు సాగులో ఆధునిక పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. శాస్త్రీయ వ్యవసాయం పాటించి పంట దిగుబడి పెంచుకోవాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయం గా పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ,సిరిగిరి శెట్టి శ్రీరామ్ మూర్తి, దొండ సన్యాసిరావు, దొండ గిరి, ఏపీవో వరహాలు బాబు, కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ రాజకుమార్ శాస్త్రవేత్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# పాత ట్రెజరీ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయండి

## కాంట్రాక్టర్,అధికారులకు అర్బన్ సీఐ ఆదేశం

**నాయుడుపేట,జూలై 23,జయ జయహే:**

నాయుడుపేట పట్టణంలోని పాత ట్రెజరీ ఆఫీస్ రోడ్డులో జరుగుతున్న మరమ్మత్తు పనులను అర్బన్ సీఐ వెంకటేశ్వర్లు పరిశీలించి,పట్టణంలో ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని పనులను నాణ్యతతో వేగవంతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ శిరసనంబేడు కళ్యాణ్ రెడ్డి మరియు సంబంధిత ఏఈకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నిర్మాణ పనుల దృష్ట్యా ఆ మార్గంలోకి భారీ వాహనాల ప్రవేశాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపిన ఆయన,ఈ విషయాన్ని మీడియా మరియు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృతంగా తెలియజేసి ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.రోడ్డు పనులు పూర్తయ్యే వరకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకుని పోలీసు శాఖకు,యంత్రాంగానికి సహకరించాలని ఆయన కోరారు.

# కూటమి ప్రభుత్వం గిరిజనులను మోసం చేస్తోంది

మొదటి పేజీ తరువాయి...

హెచ్చరించారు.

**రివ్యూ పిటిషన్ వేయలేదనడం పచ్చి అబద్ధం: కూటమి ప్రభుత్వానికి సవాల్: పాముల పుష్పశ్రీవాణి, మాజీ ఉప ముఖ్యమంత్రి**

ఎన్నికల ముందు గిరిజనులకు ఇచ్చిన హామీలను బొందపెట్టి, అధికారంలోకి వచ్చాక కళ్ల బొల్లి మాటలతో కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. జీవో నెంబర్ 3 విషయంలో అసలు వాస్తవాలు గిరిజన సోదరులకు తెలియాలి. 2002లో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సుప్రీంకోర్టులో కేసులు (జఊజఊశ్రీ ాజూజూఝశ్రీ చీశీ. 3609/2002, 7040/2002) పడ్డాయి. 18 ఏళ్ల సుదీర్ఘ వాదనల అనంతరం 2020 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు జీవో 3ని రద్దు చేసింది. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వెంటనే స్పందించి, 2020 జూన్ 18న 111వ ఏపీ ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (ాూజ) సమావేశంలో తీర్మానం చేసి, జులై 13న సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ (ఱఋతీఎ చీశీ. 14598/2020) దాఖలు చేసింది. 2024 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రివ్యూ పిటిషన్‌తో పాటు మరో 15 రివ్యూ పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. మేము రివ్యూ పిటిషనే వేయలేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదే పదే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. మీ సమీక్షా సమావేశాల్లో పాల్గొన్న ఐఏఎస్ అధికారులు, లా సెక్రటరీలతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయలేదని చెప్పించే దమ్ము కూటమి ప్రభుత్వానికి ఉందా? స్వచ్ఛందంగా రోడ్డెక్కిన ఏజెన్సీ యువతకు జీవో 3పై నాలెడ్జ్ లేదనడం, వారిని వైఎస్సార్‌సీపీ ప్రలోభపెట్టిందని అనడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. వైయస్.జగన్ హయాంలోనే ఎస్టీ కమిషన్‌ను వేరు చేశాం, సచివాలయం, వాలంటీర్ ఉద్యోగాలన్నీ స్థానిక గిరిజనులకే ఇచ్చాం. 3.22 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలిచ్చి 1.70 లక్షల మంది రైతులకు మేలు చేశాం. ఐదేళ్లలో రూ.20,000 కోట్లు గిరిజన సంక్షేమానికి ఖర్చు చేశాం. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి జీవో 3ని వెంటనే పునరుద్ధరించాలి.

**అబద్ధాలతో గెలిచి గిరిజనులను మోసం చేస్తున్నారు: పీడిక రాజన్నదొర, మాజీ ఉప ముఖ్యమంత్రి**

కూటమి నాయకులు అబద్ధాలు చెప్పి ఎన్నికల్లో గెలిచారు. 2002లో జీవో నెంబర్ 3పై సుప్రీం కోర్టులో పిటిషన్ పడినప్పుడు చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి. 2002 నుండి 2004 వరకు ఆయనే లాయర్లను పెట్టారు. మేము అధికారంలోకి వచ్చాక కూడా ఆ లాయర్లనే కొనసాగించాం. మరి ఆ రోజే చంద్రబాబు హయాంలో సమర్థవంతమైన వాదనలు ఎందుకు వినిపించలేదు? 2020లో కరోనా క్లిష్ట సమయంలో సుప్రీం కోర్టు జీవోను రద్దు చేస్తే, వైయస్.జగన్ గారిపై నిందలు వేశారు. ఎన్నికల ప్రచారంలో మన్యం జిల్లా, పాడేరు, అరకు, సాలూరులలో లోకేష్, చంద్రబాబులు జీవో 3 పునరుద్ధరిస్తామని గంటలు కొట్టి చెప్పారు. మరి ఇప్పుడు రెండేళ్లు పూర్తయినా ఎందుకు పునరుద్ధరించడం లేదు? మా హయాంలో గిరిజన సంఘాలు, యువత ధర్నాలు చేస్తే మానవత్వంతో ఆలోచించి ఎవరిపైనా కేసులు పెట్టలేదు. కానీ ఈ రోజు హక్కుల కోసం పోరాడుతున్న 15-25 మంది గిరిజన యువతపై కేసులు పెడుతున్నారు. ఇది ప్రజా ప్రభుత్వమా లేక ముస్సోలిని తరహా నియంత ప్రభుత్వమా? రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ కూటమి ప్రభుత్వమే ఉంది కాబట్టి, కేంద్రంతో మాట్లాడి లేదా ప్రత్యేక చట్టం తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేయాలి.

**హక్కులను కాలరాస్తే ఏజెన్సీ తిరగబడుతుంది: రేగ మత్స్యలింగం, అరకు ఎమ్మెల్యే**

ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు ఆయువుపట్టు లాంటి జీవో నెంబర్ 3 రద్దయితే, దానిని పరిష్కరించాల్సింది పోయి వైఎస్.జగన్ ని టార్గెట్ చేయడం సిగ్గుచేటు. ప్రత్యామ్నాయ జీవో తెస్తామని ఏజెన్సీలో డబ్బాలు కొట్టిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌లు ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారు?

గిరిజన ప్రాంతాల్లో మెడికల్ కాలేజీలకు భూములు ఇచ్చింది ఆదివాసీలు. కానీ ఉద్యోగాల్లో 6% మాత్రమే ఇస్తూ 94% గిరిజనేతరులకు కట్టబెడితే గిరిజన యువత ఎలా బ్రతకాలి? మరోవైపు 1/70 యాక్ట్‌ను తుంగలో తొక్కి మైదాన ప్రాంత వాసులు ఏజెన్సీ భూములను కబ్జా చేస్తున్నారు. గిరిజన చట్టాలు, హక్కులపై సరైన రీతిలో స్పందించి న్యాయం చేయకపోతే భవిష్యత్తులో ఉద్యమాలు మరింత తీవ్రరూపం దాల్చుతాయి.

**గిరిజన చట్టాల జోలికొస్తే ఊరుకునేది లేదు: కొట్టుగుళ్ల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే**

100% ఉపాధ్యాయ ఉద్యోగాలు గిరిజనులకే దక్కాలని తెచ్చిన జీవో 3 రద్దును రాజకీయంగా వాడుకుని చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఇంకా 'స్టడీ చేస్తున్నాం' అని సాకులు చెప్పడం విడ్డూరం. ఒకవైపు జీవో 3ని నిర్వీర్యం చేస్తూ, మరోవైపు వన్ ఆఫ్ 70 (1/70) యాక్ట్‌ను కూడా సవరించాలని చూస్తున్నారు. సాక్షాత్తు అసెంబ్లీలోనూ, విశాఖ టూరిజం మీటింగ్‌లోనూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 యాక్ట్ అభివృద్ధికి అడ్డుపడుతోందని వ్యాఖ్యానించడం సిగ్గుచేటు. వైయస్. జగన్ వరదల సమయంలోనూ 1/70 యాక్ట్ షెడ్యూల్డ్ ప్రాంతాల రక్షణ కవచమని స్పష్టంగా చెప్పారు. శాంతియుతంగా నిరసన తెలిపిన గిరిజన నాయకులపై అక్రమ కేసులు బనాయించడం ఆపాలి. మా రాజ్యాంగ హక్కుల జోలికి వస్తే గిరిజనులంతా ఏకమై బుద్ధి చెప్తారు.

**స్పష్టమైన కార్యాచరణతోనే జీవో 3 పునరుద్ధరణ సాధ్యం: డా. డివిజి శంకర్ రావు, ఏపీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్.**

సుప్రీం కోర్టులోని 5 గురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం జీవో 3ని కొట్టివేసింది. దానిని పునరుద్ధరించాలంటే ఎంతో నిర్మాణాత్మకమైన కృషి జరగాలి. ఎస్టీ కమిషన్ తరపున జీవో 3 వల్ల గిరిజన ప్రాంతాల్లో విద్యా, వైద్య, ఉపాధి రంగాల్లో జరిగిన మార్పులపై పూర్తి సర్వే నివేదికను ప్రభుత్వం ద్వారా గవర్నర్‌కు సమర్పించాం.

చంద్రబాబు నాయుడు జీవో 3ని పునరుద్ధరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. కేవలం పొలిటికల్ రిటోరిక్ (రాజకీయ ఉపన్యాసాలు)తో సరిపెట్టకుండా, ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా గట్టి నిర్మాణాత్మక కృషి చేయాలని కోరుతున్నాం.

**అబద్ధాల ప్రచారాన్ని గిరిజనులు నమ్మరు: జల్లిపల్లి సుభద్ర, విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్.**

సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు ప్రతి ఒక్కరూ జీవో 3 విషయంలో అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు. 2002లో కేసు పడినప్పుడు, 2014లో అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడే ముఖ్యమంత్రి. అప్పుడు గిరిజన శాఖ మంత్రిగా ఉన్న సంధ్యారాణి జీవో 3 గురించి ఎందుకు నోరు విప్పలేదు?

ఈ కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు 1700 మంది నాన్-ట్రైబ్స్ 1/70 యాక్ట్‌కు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు వెళ్లారంటే దీని వెనుక కూటమి నేతల ప్రోద్బలం ఉందనేది స్పష్టమవుతోంది. పాడేరులో 15 వేల నుంచి 20 వేల మంది గిరిజన యువకులు స్వచ్ఛందంగా వచ్చి ర్యాలీ చేశారు తప్ప వైఎస్సార్‌సీపీ రెచ్చగొట్టలేదు. గిరిజనులను మోసం చేయడం ఆపి, వారి గోడును వినాలి.

**చంద్రబాబు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి: పసుపులేటి.బాలరాజు, మాజీ మంత్రి**

లక్షలాది మంది ఆదివాసీ, గిరిజన ప్రజల రాజ్యాంగ చట్టబద్ధమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఎన్నికల హామీ మేరకు జీవో నంబరు 3ని పునరుద్ధరించాలి. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా హామీని అమలు చేయకుండా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బురదజల్లడం సరికాదు. ఇప్పటికైనా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి.

# పోలీస్ వ్యవస్థ మరింత ఆధునికంగా మారాలి

## మారుతున్న కాలానుగుణంగా విధానాలు మార్చుకోవాలి.. ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌లో సిఎం చంద్రబాబు

(జయ జయహే )




ఆంధ్రప్రదేశ్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు వ్యవస్థ మరింత ఆధునికంగా మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ పోలీస్ రిట్రీట్-2026 ఫ్యూచర్ పోలీసింగ్ కాన్ఫరెన్స్‌కు హాజరైన సీఎం చంద్రబాబు, మారుతున్న నేరాలకు అనుగుణంగా పోలీసులు కూడా తమ విధానాలను మార్చుకోవాలని సూచించారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం నేరాల తీరు పూర్తిగా మారిపోయిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా కొందరు సమాజంలో అశాంతిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. అలాంటి వాటిపై పోలీసులు అప్రమత్తంగా ఉండి వేగంగా స్పందించాలని సూచించారు. పోలీస్ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరించాలని, సాంకేతికతను మరింత సమర్థంగా వినియోగించాలని చంద్రబాబు సూచించారు. 'ఇన్విజిబుల్ పోలీస్.. విజిబుల్ పోలీసింగ్' విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా పోలీసింగ్ ఉండాలని చెప్పారు. నేరాలను అరికట్టడమే కాకుండా, నేరాలకు పాల్పడిన వారికి శిక్ష పడేలా చేయగలిగితే నేరాలు అదుపులోకి వస్తాయన్నారు. ప్రభుత్వంపై బురదజల్లేందుకు కొన్ని రాజకీయ పార్టీలు నేరాలకు కూడా వెనుకాడటం లేదని చంద్రబాబు అన్నారు. పాస్టర్ ప్రవీణ్ ఘటనలో జరిగిన దుష్ప్రచారాన్ని పోలీసులు సమర్థంగా తిప్పికొట్టారని గుర్తుచేశారు. రాష్ట్రంలో గంజాయి నియంత్రణలో కొంత పురోగతి సాధించినప్పటికీ, ఇంకా పూర్తిస్థాయిలో కట్టడి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. గంజాయి మత్తులో జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే రౌడీయిజం, ఫ్యాక్షనిజాన్ని సమర్థంగా నియంత్రించామని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని చంద్రబాబు నాయుడు సూచించారు.

# 'శాశ్వత నో మైనింగ్ జోన్'గా జీఓ విడుదల చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ఉద్యమాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేష్ ఈ అంశంపై పార్లమెంట్‌లో స్పందించి జరిగిన తప్పును అంగీకరించాలని, లేకుంటే పార్లమెంట్ లో పంచదార్ల అక్రమ మైనింగ్ పై చర్చకు లేవనెత్తుతామని ధర్మశ్రీ స్పష్టం చేసారు. అంతేగాక కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి పంచదార్ల అక్రమ మైనింగ్ పై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. విశాఖపట్నంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంచదారల కొండ పరిసర ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ పూర్తిగా నిలిపివేయడంతో పాటు ఇప్పటికే తవ్విన ప్రాంతాలను పునరుద్ధరించి యథాతథ పరిస్థితిని తేవాలని ధర్మశ్రీ డిమాండ్ చేశారు. ధర్మలింగేశ్వర స్వామి ఆలయంతో పాటు పంచదారల సముదాయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పంచదార్ల కొండలలో అక్రమ మైనింగ్ లో ప్రసిద్ధి ఆలయాలు, హిందూ సంస్కృతి ధ్వంసమైందని గ్రహించారు కాబట్టే విచారణకు ఆదేశించారని, అయితే పవన్ కల్యాణ్ తన చిత్తశుద్ధిని చాటుకునేలా 30 కిలో మీటర్ల మేర పంచదార్లను శాశ్వత నో మైనింగ్ జోన్ ప్రకటన చేస్తూ జీఓ తేవడంతో పాటుగా, ధ్వంసమైన ప్రాంతాన్ని పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని, ఇందుకు బాధ్యులను గుర్తించి వారి కఠిన చర్యలు తీసుకునేలా వ్యవహరించాలని హితవు పలికారు. మైనింగ్ ప్రాంతాన్ని రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ శాఖల అధికారులు పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ కు ఇచ్చిన నివేదికల్లో నిబంధనల ఉల్లంఘనలు స్పష్టంగా నమోదయ్యాయని ధర్మశ్రీ తెలిపారు. తనిఖీల సందర్భంగా మైనింగ్ కార్యకలాపాలు ఐదు జలధారలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని సంబంధిత శాఖలే కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నాయని వెల్లడించారు. పంచదార్లలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తన అనుచరుల పేరుతో, ఎలమంచిలి నియోజకవర్గ జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ సాగిస్తున్న అక్రమ మైనింగ్, గ్రావెల్ తరలింపుపై తమ పార్టీ శ్రేణులు తొలుత రిలే నిరాహార దీక్షలు, "చలో పంచదార" కార్యక్రమం, ప్రజా ఉద్యమాల చేపట్టాయి. వీటికి ప్రజల నుంచి సంఘీభావం చూసి కూటమి ప్రభుత్వం గజగజ లాడింది. దీంతో గత్యంతరం లేక ప్రభుత్వం తాత్కాలికంగా మైనింగ్ కార్యకలాపాలను నిలిపివేసింది. మహాశివరాత్రి సందర్భంగా లక్షలాది మంది భక్తులు పంచదారల జలధారల్లో పుణ్యస్నానాలు చేస్తారు. అలాంటి పవిత్ర క్షేత్రాన్ని అక్రమ మైనింగ్ ద్వారా నాశనం చేయడంను వైఎస్సార్‌సీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. పంచదారల కొండకు సంపూర్ణ రక్షణ కల్పించే వరకు, 30 కిలోమీటర్ల పరిధిని శాశ్వత నో-మైనింగ్ జోన్‌గా ప్రకటించే వరకు ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తాం అని స్పష్టం చేసారు.

**ఎమ్మెల్యే సుందరపు రాజకీయంగా గుండు గీస్తాం.. సీఎం రమేశ్ ఎక్కడ నుంచి వచ్చారో అక్కడకే పంపుతాం**

ఎలమంచిలి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కు సబ్జెక్టు తెలియదు. ఊరంత నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడితే సహించేది లేదు. నువ్వు మర్యాదగా నోరు అదుపు పెట్టుకొని మాట్లాడు లేకపోతే మాత్రం ఇంకా నిన్ను పరిగెత్తిస్తాం. ఎట్టి పరిస్థితిలో నీ జాతకం బట్టబయలు చేస్తా. ఈ రోజు నుంచి నిన్ను, ఎంపీ సీఎం రమేశ్ ను నిద్రపోనివ్వకుండా చేస్తా. సీఎం రమేశ్ ఎక్కడ నుంచి వచ్చాడో అక్కడికి పంపించే వరకు విశ్రమించేది లేదు. స్థానిక ఎన్నకల్లో మా సత్తా ఏంటో చూపుతాం.. కాచుకోండి అని సవాల్ విసిరారు



# కొత్త శ్రీనివాస్‌కు కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డు

భీమవరం : (జయ జయహే )

హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లోగురువారం జరిగిన కోడి రామకృష్ణ ఫిల్మ్ అవార్డు -2026 ప్రదానోత్సవంలో భీమవరానికి చెందిన కొత్త శ్రీనివాస్ కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డును అందుకున్నారు. దివంగత దర్శకుడు కోడి రామకృష్ణ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం పలువురు సినీ, సామాజిక రంగ ప్రముఖులకు 'కోడి రామకృష్ణ పురస్కారాలు' అందజేస్తూ వస్తున్నారని, దీనిలో భాగంగా భీమవరంలో విశిష్ట సేవాతత్పరుల, పశ్చిమ గోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి, డిఎన్నార్ కళాశాల కోశాధికారి, మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ సలహామండలి సభ్యులుగా, చిన్మయ మిషన్ కార్యదర్శిగా ఎన్నో సేవాలందిస్తున్న కొత్త శ్రీనివాస్ ఈ సేవా రత్న అవార్డును అందుకున్నారు. ఫౌండర్ చైర్మన్ నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, అవార్డ్స్ కమిటీ చైర్మన్ వీర శంకర్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు, సినీ నటులు పద్మశ్రీ మురళీమోహన్, సుమన్,దివ్యవాణి, బాబుమోహన్, ప్రముఖ నిర్మాత అంబికా కృష్ణ పలువురు సినీ ప్రముఖులచే కోడి రామకృష్ణ సేవా రత్న అవార్డును కొత్త శ్రీనివాస్ అందుకున్నారు. సేవారత్న అవార్డును సాధించిన శ్రీనివాస్ ను భీమవరం పట్టణ ప్రముఖులు, మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ మరియు కన్వీనర్ బొండా రాంబాబు,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రటరీ వొలేటి శ్రీనివాస్, శోభన్ బాబు సేవాసమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు, భీమవరం బులియన్ అసోసియేషన్ అధ్యక్షులు కోట్ల నాని, కురిశెట్టి కాశి, జూలూరి గోపి రాజు,గుండు సుమూర్తి, అనంతపల్లి సుబ్బారావు, సంకా బాబు, చవ్వా భామ కృష్ణమూర్తి, బంధు మిత్రులు, స్నేహితులు పాల్గొన్నారు

# బ్యాంకింగ్‌కు క్వాంటం టెక్నాలజీని జోడింపు

## పిఎన్‌బితో బాబు సమక్షంలో ప్రభుత్వం కీలక ఒప్పందం

(జయ జయహే )

భవిష్యత్ బ్యాంకింగ్‌కు క్వాంటం టెక్నాలజీని జోడించే దిశగా అమరావతి మరో కీలక మైలురాయిని చేరుకుంది. పీఎన్‌బీతో రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. బ్యాంకింగ్ రంగంలో అత్యాధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ అమరావతిలో క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి ఏపీ క్వాంటం మిషన్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పీఎన్‌బీ సీఈఓ, ఎండీ అశోక్ చంద్రతో కలిసి ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అమరావతి క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌లో ఏర్పాటు కానున్న ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా బ్యాంకింగ్ రంగంలో క్వాంటం కంప్యూటింగ్ ఆధారిత పరిశోధనలు, సాంకేతిక పరిష్కారాల అభివృద్ధికి ప్రోత్సాహం లభించనుంది. దేశంలో బ్యాంకింగ్ రంగం కోసం ప్రత్యేకంగా క్వాంటం ఫైనాన్స్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న తొలి బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంక్ నిలిచింది. ఈ ప్రాజెక్టుతో అమరావతి క్వాంటం వ్యాలీ ప్రతిష్ఠ మరింత పెరగడంతో పాటు, ఆంధ్రప్రదేశ్‌ను క్వాంటం టెక్నాలజీ, ఫిన్‌టెక్ రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టేందుకు ఇది కీలకంగా మారనుంది.

# నేటి తరానికి తగ్గుతున్న ఓపిక

## హనీమూన్ మర్డర్ ఘటనే నిదర్శనం

## సోనమ్ బెయిల్ రద్దు చేసిన సుప్రీంకోర్టు

(జయ జయహే )



సమాజం అనేక మార్పులకు లోనవుతున్న కారణంగా హనీమూన్ మర్డర్ లాంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయని సుప్రీం కోర్టు తాజాగా వ్యాఖ్యానించింది. గతేడాది హనీమూన్ సందర్భంగా భర్తను హత్య చేసిన సోనమ్ రఘువంశీ బెయిల్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలను చేసింది. ఈ కేసులో జస్టిస్ ఎం. ఎం సుందరేశ్, జస్టిస్ పీబీ వరాలె ధర్మాసనం సోనమ్ బెయిల్‌ను రద్దు చేసింది. ఆమె మూడు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. మారుతున్న సమాజంలో ఇలాంటి కేసులు వెలుగు చూస్తున్నాయి. నేటి తరానికి ఓపిక తక్కువ. సమస్యలకు తక్షణ పరిష్కారాలు కావాలని వారు కోరుకుంటున్నారు. వ్యక్తిగత చట్టాలకు సంబంధించిన పలు కేసులు భవిష్యత్తులో కోర్టుల ముందుకు వస్తాయని జస్టిస్ సుందరేశ్ అన్నారు. ఇక ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనలర్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ సమాజిక మాధ్యమాల ద్వారా ప్రస్తుత తరానికి అధిక సమాచారం అందుబాటులో ఉందని అన్నారు. కానీ జ్ఞానం మాత్రం లేదని వ్యాఖ్యానించారు. వాట్సాప్‌లో షేర్ చేస్తున్న సమాచారమే జ్ఞానంగా చెలామణీ అవుతోందని జస్టిస్ వరాలె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 'హనీమూన్‌కు వెళ్లే భర్త తన వెంట బాడీగార్డులను కూడా తీసుకెళ్లినట్టు చెప్పే కామెడీ రీల్స్ వస్తున్నాయి. భార్యాభర్తల మధ్య ఒకప్పుడున్న పరస్పర విశ్వాసం క్రమంగా తగ్గిపోతోంది. గతంలో ఇలాంటి సందర్భాల్లో ఉమ్మడి కుటుంబాలు భార్యాభర్తల సమస్యలను మెరుగ్గా పరిష్కరించేవి' అని సొలిసిటర్ జనరల్ మెహతా చెప్పారు.ఇందుకు ధర్మాసనం స్పందిస్తూ.. 'మీరు ఉమ్మడి కుటుంబంలోని వారైతే అసంతృప్తిని ఎదుర్కోవడం, సర్దుకుపోవడం అలవాటు అవుతుంది. చిన్న కుటుంబాల్లోని వారు ఏదైనా తక్కువైతే మారాం చేస్తారు' అని వ్యాఖ్యానించింది. చిన్న కుటుంబాల కారణంగా జనాల్లో డిప్రెషన్ పెరుగుతోందన్న నివేదికలు కూడా ఉన్నాయని మెహతా చెప్పారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com